


అడిగింది ఇస్తేనే.. అప్రూవల్


ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తేచాలు క్షణాల్లో మీ వాహనాల రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి బదిలీల వరకు ఇట్టే వేళ్లమీద చేసేసుకోవచ్చు. వీటికోసం ఇకపై మీ సమయాన్ని, శ్రమను వృథా చేసుకోవలసిన పనిలేదు. అంతా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతాయి... ఇదీ కేంద్ర ప్రభుత్వ రవాణా మంత్రిత్వశాఖ చెబుతున్న మాట. దీనికోసమే గతంలో ప్రతి రాష్ట్రానికి ఉన్న యాప్‌లను తొలగించేసి, వాటి స్థానంలో ఈ-వాహన్ అనే యాప్‌ను తీసుకొచ్చింది. దేశంలో ఉన్న వాహనాలకు సంబంధించిన అన్ని సేవలు ఎక్కడైనా పొందేలా, కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లో క్షణాల్లో పూర్తిచేసుకునేలా వెసులుబాటు కల్పించామనేది కేంద్ర ప్రభుత్వ శాఖల మాట. అయితే ఇది కేవలం మాటలకే పరిమితమయింది. పర్యవేక్షణ కొరవడటమో! లేక మామూళ్లకు అలవాటుపడటంవల్లో కానీ, చేతులు తడపకుండా అప్రూవల్ ఇవ్వటానికి ఆ చేతులు రావటం లేదు.



కేంద్రం ప్రవేశపెట్టిన ఇ-వాహన్ యాప్

- ఈ - వాహన్‌లో వాహనదారుల కష్టాలు
- ఆర్టీవో కార్యాలయానికి వెళ్లకుంటే ఫైల్ కదిలేది లేదు
- ఆన్‌లైన్ సేవలపైనా నిలువు దోపిడీ
- నెలల తరబడి ఆన్‌లైన్ దరఖాస్తుల పెండింగ్
- పర్యవేక్షణ కొరవడటంతో ఆర్టీవోల ఇష్టారాజ్యం
- ఆర్‌సీ కార్డ్‌కోసం ఫీజు చెల్లించినా రెండేళ్లుగా అందని కార్డులు

తెనాలి, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు ఆర్టీఓలు ఆన్‌లైన్ దరఖాస్తులను తొక్కిపెట్టి మరీ, దరఖాస్తుదారులను కార్యాలయాలకు పిలిపించుకుని లంచాలు దండుకున్న తర్వాతే వాటిని ఓకే చేయటం, లేదంటే ఆ కాగితం లేదు... ఈ కాగితం లేదంటూ తిప్పుతూనే ఉన్న పరిస్థితి. చివరకు ఇన్సూరెన్స్ వివరాలు ఆన్‌లైన్‌లోనే కనిపిస్తున్నా, దానికి సంబంధించిన పేపర్ చూపాల్సిందేనంటూ తిప్పిపంపటం వంటివి వీరి వసూళ్లకు పరాకాష్ట. చివరకు ఆన్‌లైన్‌లో ఒక్క బటన్ క్లిక్‌తో ఓకే చేయగలిగిన ఈ-కేవైసీ, ఫోన్, ఆధార్ నంబర్‌ల అప్‌డేషన్, మండల, జిల్లాల వివరాల సవరణ వంటివాటినీ వదలకుండా ప్రతి పనికీ రేటు పెట్టేసి దోచేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసిన ఈ-ప్రగతి యాప్ ద్వారా అయితే మొదటి దరఖాస్తు పరిష్కారం చూపాకే రెండో దరఖాస్తు ఓపెన్ అయ్యేది. దీనివల్ల మామూళ్లు అందినా, లేకున్నా దరఖాస్తులన్నీ వరుస క్రమంలోనే క్లియర్ చెయ్యాల్సివచ్చేది. కానీ ఈ-వాహన్ యాప్‌లో ఆ పరిస్థితిలేదు అప్లికేషన్ నంబర్ కొడితే ఓపెన్ అవుతుండటంతో వారికి డబ్బు ముట్టిన దరఖాస్తులను క్లియర్‌చేసి, అందని వాటిని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో నెలల తరబడి ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగ్ పడిపోతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తు చేసినవారు నెలల తరబడి ఎదురుచూసి, చివరకు ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లక తప్పటంలేదు. దీంతో కేంద్రం ప్రతిష్ఠాత్మకగా తీసుకొచ్చిన వాహన్ యాప్ కొందరు వసూళ్ల అధికారులకు వరంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ఆర్టీఓ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ దోపిడీ యథేచ్ఛగా సాగిపోతూనే ఉంది. దీంతో దరఖాస్తుదారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి.



రాష్ట్రంలో ఎక్కడి ఆర్టీవో కార్యాలయంలోనయినా సేవలు పొందేలా ఆన్‌లైన్ యాప్‌లోనే ఇచ్చిన ఆప్షన్

ఆఫ్‌లైన్‌లో చేతులు తడిపితేనే...

కేంద్రం దేశవ్యాప్తంగా తీసుకొచ్చిన ఈ-వాహన్ యాప్ ద్వారా కొత్త వాహనాల రిజిస్ట్రేషన్, యాజమాన్య బదిలీ, జాతీయ, అంతర్రాష్ట్ర పర్మిట్‌ల మంజూరు, రెన్యువల్స్ (మిగతా 8వ పేజీలో)

కృష్ణా జిల్లా వంటి కొన్ని జిల్లాల్లోని ఆర్టీఓ కార్యాలయాల్లో ఏ రోజుకారోజు దరఖాస్తులన్నీ పరిశీలించి, వాటికి అప్రూవల్ ఇవ్వాల్సిందేనని ఆదేశాలున్నాయి. ప్రతి విభాగంలోనూ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా జీరో చూపించి, దానిని ఫోటోతీసి ఉన్నతాధికారులకు ప్రతి రోజూ అప్‌లోడ్ చెయ్యాలి. కానీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాత్రం అది కనిపించటంలేదు.

"కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలంటే రూ. 1065 ప్రభుత్వ చలానా చెల్లించాలి. ఇవికాక రూ. 1000 నుంచి రూ. 1800 అదనంగా అందిస్తేనే ఆ ఫైల్ ముందుకు వెళుతుంది. ఇవన్నీ సాధారణంగా జరుగుతున్న తంతే. ఇవికాక ఈ-కేవైసీ వంటివి, ఫోన్ నంబర్ అప్డేట్, కొత్త జిల్లాలు వచ్చాక మండలం, జిల్లా పేరు మార్పుల వంటివి ఆధార్ కార్డు జతచేస్తే దాని ఆధారంగా చేసేవే అయినా, వాటికీ మామూళ్లు ఇచ్చుకోవలసిన పరిస్థితి. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో రూ. 600 నుంచి రూ. 700 వరకు ప్రతి దరఖాస్తుకు ఒక రేటు నిర్ణయించారు. ఈ మొత్తం చెల్లిస్తేనే ఈ-కేవైసీ వంటివి కూడా ఓకే చేస్తున్నారంటే దోపిడీ పరిస్థితి అర్థమవుతుంది. మేమేమీ లంచాలు తీసుకోవటంలేదని, నిబంధనల ప్రకారం పనిచేస్తున్నామని కొందరు అధికారులు చెబుతుంటే, ఏరోజుకారోజు పరిష్కారం చూపాల్సిన దరఖాస్తులు నెలల తరబడి వందల సంఖ్యలో ఎందుకు పెండింగ్ ఉంటున్నాయనేది అంతుబట్టని విషయం. పైగా ఒకదాని తర్వాత ఒకటి వరుస క్రమంలో పరిష్కారం కావలసిన దరఖాస్తులు అక్కడక్కడ ఒక్కోటి అవుతున్నాయంటే... దీనివెనకున్న కారణాలేమిటనేది అధికారులే చెప్పాల్సిన మాట."

చెరువులను బలోపేతం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వీటి నిల్వ సామర్థ్యం పెంచేవిధంగా పూడికతీత పనులకు శ్రీకారం చుట్టాలని సంకల్పించింది. కట్టలను పటిష్టం చేసి కంప చెట్లను తొలగింపు పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి జిల్లాలో పంచాయతీకి ఒక కుంట లేదా ఒక చెరువును ఎంపిక చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది చెరువులకు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

చెరువులకు మహర్దశ

- రెండో విడత అమృత్ సరోవర్ పనులకు శ్రీకారం
- పంచాయతీకి ఒకటి చొప్పున ఎంపిక


అధ్వాన స్థితిలో ఉన్న చెరువు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమృత్ సరోవర్ రెండో విడత కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రెండేళ్ల కిందట ప్రతి జిల్లాలో మండలానికి ఒకటి నుంచి మూడు చెరువుల వరకు అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. మూడు జిల్లాలో 223 చెరువులను అభివృద్ధి చేశారు. పల్నాడు జిల్లాలో 75, గుంటూరు జిల్లాలో 75, బాపట్ల జిల్లాలో 73 చెరువులను అమృత్ పథకం మొదట విడతలో అభివృద్ధి చేశారు. ఉపాధిహామీ, నీటిపారుదలశాఖ పర్యవేక్షణలో ఆయా పనులు పూర్తి చేశారు. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో పంచాయతీలో ఒక చెరువు లేదా ఒక కుంటను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చిన్ననీటిపారుదల శాఖ పరిధిలో ఉన్న సాగుకు నీరందించే చెరువులను బలోపేతం చేయాలని నిర్ణయించారు.

తాజాగా మళ్లీ పంచాయతీకి ఒక కుంట లేదా చెరువును గుర్తించాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులు అందాయి. ఒక్కో చెరువు లేదా కుంటలో నీరు నిల్వ చేయడానికి కనీసం ఒక ఎకరా విస్తీర్ణంలో ఉండాలి. 10 వేల క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ చేసేవిధంగా పనులు చేయనున్నారు. ఇందు కోసం ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించనున్నారు. కట్టలపై కంప చెట్లు తొలగించి మరింత పటిష్టం చేయనున్నారు. గత కొన్నేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో కట్టలు బలహీనంగా ఉన్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు వచ్చిన వరదనీటి ఉధృతికి గండ్లు పడుతున్నాయి. సమీపంలో ఉన్న భూములు కోతకు గురవుతున్నాయి. ఇసుక, మట్టి మేటలు వేయడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా చెరువులను మరింత బలోపేతం చేయనున్నారు. మండలాల వారీగా కుంటలు, చెరువులను ఎంపిక చేస్తున్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేశారు. చెరువులు.. కుంటలను త్వరగా గుర్తించి అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఒక్కో చెరువులో పనులు చేయాలంటే ఉపాధి హామీ పథకం కింద రూ.5 నుంచి రూ. 10 లక్షల వరకు మంజూరు చేసే అవకాశం ఉంది.

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు అంచనాలు రూపొందించే ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రతిపాదనలు అందగానే పనులు చేపట్టడానికి అనుమతులిస్తారు. మూడు జిల్లాల్లో 1172 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 223 పంచాయతీల్లో అమృత్ పథకం తొలివిడతలో చెరువులను అభివృద్ధి చేశారు. పల్నాడు జిల్లాలో 434, బాపట్ల జిల్లాలో 353, గుంటూరు జిల్లాలో 152 చెరువులను అమృత్ -2 పథకం కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రెడీ అవుతున్నాయి.

ఉడతా ఉడతా ఊచ్... ఆహారం దొరికిందోచ్...

ఆహారం కోసం వెతుకుతున్న ఉడతకు ఓ ఇంటిపై ఉంచిన పూరీ ముక్క దొరకటంతో నోటితో కరుచుకొని వెళ్లి ప్రశాంతంగా తింటున్న దృశ్యం.



నకిలీ డ్వాక్రా గ్రూపులతో.. రూ.1.16 కోట్లు స్వాహా

నల్లపాడు జీడీసీసీలో మరో కుంభకోణం

బ్యాంకును అప్రమత్తం చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

గుంటూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం నల్లపాడు జీడీసీసీ బ్యాంకులో చోటుచేసుకున్న మరో ఘోరం వెలుగులోకి వచ్చింది. నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి రూ. 1.16 కోట్లు కొట్టేశారు. ఈ విషయాన్ని గుంటూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ గుర్తించింది. మొత్తం 10 నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి బ్యాంకును మోసగించారు. ఆ సంఘాలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందినవి కాదని పీడీ టీవీ విజయలక్ష్మీ స్పష్టం చేశారు. అదే విషయాన్ని జీడీసీసీ బ్యాంకు దృష్టికి తీసుకెళ్లారు. నకిలీ డ్వాక్రా గ్రూపులతో కొందరు వ్యక్తులు జీడీసీసీలో రూ. 1.16 కోట్లు దారిమళ్లించిన విషయానికి సంబంధించిన సమాచారాన్ని పీడీ విజయలక్ష్మీ పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఈ వ్యవహారంలో జిల్లా అధికారులు సీరియస్‌గా వున్నారు.

23 నుంచి మిర్చియార్డులో.. ఉచిత భోజనం

- ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మీల్స్
- డైనింగ్ హాల్స్‌ని సిద్ధం చేసిన అధికారులు
- టిఫిన్, లంచ్ కలిపి ఒక్కో వ్యక్తికి రూ. 132.65 పైసల ఖర్చు
- గత వైసీపీ హయాంలో రూ. 150 చెల్లింపు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చి సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరుకు వచ్చే రైతులు భోజనం కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఉచిత భోజన పథకాన్ని ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించింది. రోజుకు ఎంతమంది రైతులు వచ్చినా భోజనం వడ్డించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 23వ తేదీన జిల్లా ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. యార్డు నల్లపాడు గేటు వైపున ఉన్న రెండు భోజన శాలల్లో ఉదయం 11 గంటల నుంచే రైతులకు మధ్యాహ్న భోజనం వడ్డించడం ప్రారంభిస్తామని అధికారవర్గాలు తెలిపాయి. ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడే కార్యక్రమంగా పేర్కొన్నాయి.

అల్పాహారం, భోజనం ఇలా...

ప్రతీ రోజు రెండు ఇడ్లీ, చట్నీ, కారంపొడి, టీ సోమ, బుధ, శుక్రవారాలలో అయితే కట్టె పొంగలి(సాంబారుతో), మంగళ, గురువారంలో టమాటబాత్ వడ్డిస్తారు. మధ్యాహ్న భోజనంలో ఒక స్వీటు, గుడ్డు, అన్నం, పప్పు, వేపుడు కూర, రోటీ పచ్చడి, సాంబారు, ఇగురు కూర(శాకాహారం), పెరుగు వడ్డన చేస్తారు.

వైసీపీ హయాంలో కంటే ఛార్జీలు తక్కువ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేశారు. అయితే ఇందుకు గాను ఒక్కో ప్లేటుకు రూ. 150 వరకు వసూలు చేశారు. అయితే ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వ అధికారులు సంప్రదింపులు జరిపి ధరలు తగ్గించేలా ఒప్పించారు. తద్వారా అల్పాహారం రూ. 42.75 పైసలు, భోజనం రూ. 89.90 పైసలకు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకొన్నారు. దీంతో రెండూకలిపి రూ. 132.65 పైసలకు తగ్గిపోయింది. తొలి రెండు రోజులు మధ్యాహ్న భోజన పథకం మాత్రమే అమలు చేస్తామని, వచ్చే సోమవారం నుంచి ఉదయం అల్పాహారం కూడా ప్రారంభమౌతుందని మార్కెట్ కమిటీ సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు తెలిపారు.


మిర్చియార్డులో రైతులకు ఉచితంగా అల్పాహారం, భోజనం వడ్డించేందుకు సిద్ధం చేసిన భోజన శాల

ఆర్టీసీకి పండగే
- సంక్రాంతికి రాకపోకలతో రూ. కోటి వరకు ఆదాయం
- తిరుగుప్రయాణికులతో గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో రద్దీ

8

ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం డిగ్రీ కోర్సుల ఫలితాల విడుదల

రేకుల షెడ్డు ఇంటిలో భారీ పేలుడు
- గదిలో చెలరేగిన మంటలు
- వృద్ధ దంపతులకు గాయాలు

6

వెస్ట్, సౌత్ డీఎస్పీ.. బాధ్యతల స్వీకారం

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ డీఎస్పీగా కే అరవింద్, సౌత్ డీఎస్పీగా జీ భానోదయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని, ఎస్పీ సతీష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు సంబంధించి నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో రాజీ వద్దని కఠినంగా వ్యవహరించాలన్నారు.


ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్

శాంతి భద్రతలకు ప్రాధాన్యం : డీఎస్పీ భానోదయ

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదని భానోదయ హెచ్చరించారు. సోమవారం ఆమె సౌత్ డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులందరికీ సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాను గతంలో 2023లో రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ ప్రొబెషనరీ డీఎస్పీగా విధులు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

విశాఖపట్నానికి చెందిన భానోదయ సివిల్స్ లక్ష్యంగా సిద్ధమవుతూ తొలి ప్రయత్నంలోనే గ్రూప్ -1 అధికారిణిగా ఎంపికయ్యారు. గ్రూప్-1కు ఎంపికైనప్పటికీ తన లక్ష్యం సివిల్స్ మాత్రం వదులుకోలేదన్నారు. భానోదయ తండ్రి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగి. ఆమె తల్లి గృహిణిగా ఉన్నారు. భానోదయ ఇంటర్మీడియట్ వరకు విశాఖపట్నంలో చదువుకున్నారు. సివిల్స్ లక్ష్యం నేపథ్యంలో ఆమె తన మకాం హైదరాబాద్‌కు మార్చి అక్కడే డిగ్రీ, ఆ తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేసారు. సివిల్స్ ద్వారా ఐఏఎస్ లేదంటే ఐపీఎస్ లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని ప్రణాళిక బద్ధంగా చదివినట్లు ఆమె తెలిపారు.

చట్ట పరిధిలో పోలీసింగ్ : డీఎస్పీ కరారు అరవింద్

సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించేలా చర్యలు తీసుకుంటానని వెస్ట్ డీఎస్పీ కరారు అరవింద్ స్పష్టం చేశారు. వెస్ట్ డీఎస్పీగా సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో రౌడీషీటర్లు, చోరీ కేసు నిందితులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. దొంగతనాలు చైన్ స్నాచింగ్ నేరాలను అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

సివిల్స్ లక్ష్యం... తొలి ప్రయత్నంలోనే డీఎస్పీగా

కర్నూలుకు చెందిన కరారు అరవింద్‌కు సివిల్స్ లక్ష్యం కాగా తొలి ప్రయత్నం లోనే గ్రూప్ -1 ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి బీటెక్ వరకు కర్నూలులోనే సాగింది. బీటెక్ అనంతరం రెండేళ్లు ఆయన సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేశారు. ఆ తరువాత సివిల్స్ కోసం సిద్ధమయ్యారు. 2022లో గ్రూప్ -1కు ఎంపికై డీఎస్పీగా నియమితులయ్యారు. ఆ తర్వాత ఆయన గ్రేహౌండ్స్ లోనే ప్రొబేషనరీ డీఎస్పీగా ఇప్పటివరకు విధులు నిర్వహించారు.


ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ

విజ్ఞాన్స్ లారాకు సిస్కో నెట్ ఎకాడ్ ఎక్సలెన్స్ అవార్డ్



సర్టిఫికెట్‌ను డాక్టర్ లావు రత్తయ్యకు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఫణీంద్రకుమార్

గుంటూరు(విద్య), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక సిస్కో నెట్ ఎకాడ్ ఎక్సలెన్స్ అవార్డ్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్ర కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సిస్కో నెట్ ఎకాడ్ సంస్థతో 150 కళాశాలలు అనుసంధానమై ఉన్నాయనీ, అందులో కేవలం 13 కళాశాలలకు మాత్రమే ఈ పురస్కారం లభించిందన్నారు. వీటిలో విజ్ఞాన్స్ లారా ఒకటైనందుకు సంతోషంగా ఉందన్నారు. సిస్కో నెట్ ఎకాడ్ వారిచే నిర్వహించిన నెట్ వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామింగ్ , ప్యాకెట్ ట్రేసర్ అనే అడ్వాన్స్ కోర్సులలో విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తీర్ణత పొంది 8600 సర్టిఫికెట్స్ సాధించినందుకుగానూ ఈ పురస్కారం లభించిందని తెలిపారు. విజ్ఞాన్స్ లారా కళాశాలకు ఈ ప్రతిష్టాత్మక సిస్కో నెట్ ఎకాడ్ ఎక్సలెన్స్ అవార్డ్ లభించినందుకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య కళాశాల ప్రిన్సిపల్‌ను, ఆయా విభాగ డీన్లు, విభాగాధిపతులను, అధ్యాపకులను అభినందించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ రవికుమార్

తాడేపల్లి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం మహానాడు వద్ద ఇటీవల జరిగిన చోరీలకు సంబంధించిన కేసులో ముద్దాయిని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని అతని నుంచి 82 గ్రాముల బంగారం, 70 గ్రాముల వెండి, 25 వేల నగదు రికవరీ చేసినట్టు సోమవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ రవికుమార్ వెల్లడించారు. మొత్తం విలువ రూ. 5.65 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. కాగా తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో తగినంత సిబ్బంది లేరని, పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని అడిషనల్ ఎస్పీ రవికుమార్ తెలిపారు. సమావేశంలో సీఐ కల్యాణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోట్ల రూపాయలు మింగేసిన వైసీపీ

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
- రాష్ట్ర వ్యాప్తంగా 24వేల గోకులాల మంజూరు




సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ప్రచార వాహనాల పేరుతో కోట్ల రూపాయలు బిల్లులు మింగారని, మూగ జీవాలకు కూడా అన్యాయం చేశారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని నడిగడ్డ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మృతి చెందిన గేదెలకు కనీసం ఇన్సూరెన్స్ చెల్లించిన దాఖలాలు లేవని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాడి రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో 85 శాతం బీమా ప్రీమియం చెల్లించి పాడిగేదెలను కోల్పోయిన రైతులకు కేవలం 20 రోజుల్లో బీమా నగదును చెల్లిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 45 వేల పశువులు చనిపోతే ఒక్క గేదెకు కూడా ఇన్సూరెన్స్ చెల్లించలేదనీ, దీంతో పాడి పశువులపై ఆధారపడిన రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లు అప్పులు మిగిల్చిందని తెలిపారు. మూగ జీవాలకు కనీసం డీవార్మింగ్ మందులు ఇచ్చిన దాఖలాలు లేవని మండిపడ్డారు. పశువుల ఆరోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వాడవాడలా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పశుపోషలకు కొండంత అండగా నిలిచిందన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా 24వేల గోకుల షెడ్డులను మంజూరు చేసి, ఆర్నెల్ల వ్యవధిలోనే వాటి నిర్మాణాలు కూడా పూర్తి చేశామన్నారు. పశుపోషణపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, ఏడీ సరోజనిదేవి, శ్రీనివాసమూర్తి, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణిజేటి నాగశ్రీనురాయల్, పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ మాదినేని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ బ్లాక్‌కు 'తులసీ రామచంద్ర ప్రభు' పేరు

- భవన నిర్మాణానికి రూ.10 కోట్ల విరాళం
- దాత పేరిట నామకరణానికి ప్రభుత్వ ఆదేశాలు



ప్రభుత్వ సమగ్రాస్పత్రి. ఇన్‌సెట్లో తులసీ రామచంద్ర ప్రభు

గుంటూరు మెడికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో జీ ప్లస్ 4గా చేపడుతున్న సర్వీస్ బ్లాక్ భవనానికి నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, తులసీ సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభు పేరు పెట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ భవన నిర్మాణానికి అయ్యే ఖర్చును రామచంద్ర ప్రభు విరాళంగా అందించనున్నారు. ప్రస్తుతం ఆయన గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధి సంఘం (హెచ్‌డీఎస్) సభ్యుడుగా వ్యవహరిస్తున్నారు. సర్వీస్ బ్లాక్ భవన నిర్మాణానికి దాతగా ముందుకొచ్చిన నేపథ్యంలో ఈ సర్వీస్ బ్లాక్‌కు ఆయన పేరు పెట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. త్వరలో నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. పాత కాంట్రాక్టర్ ఒప్పందం రద్దు చేసిన ప్రభుత్వం, హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ సిద్ధార కన్‌స్ట్రక్షన్స్‌కు ఈ భవన నిర్మాణ పనులు అప్పగించింది. ఈ సర్వీస్ బ్లాక్‌లో సెంట్రల్ కిచెన్, హాస్పిటల్ స్టోర్స్ విభాగం, మెకనైజ్డ్ లాండ్రి, ఎంఆర్‌డీ సెక్షన్, సెంట్రల్ స్టెరిలైజేషన్ డిపార్టుమెంట్ వంటి పలు విభాగాలను ఏర్పాటు చేస్తారు.

పదేళ్ల కిందటే నిర్ణయం

ప్రభుత్వాస్పత్రి అవసరాల కోసం జీ ప్లస్ ఫోర్‌గా సర్వీస్ బ్లాక్ నిర్మించాలని పదేళ్ల కిందటే ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో ఈ భవన నిర్మాణానికి రూ.7,69,42,505 నిధులు మంజూరు చేసింది. హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ శివరామ్ అండ్ కో అనే కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఈ సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులు అప్పగించారు. మొదటి నుంచి ఈ సంస్థ నిర్మాణ పనులపై ఆసక్తి చూపలేదు. రెండు, మూడేళ్ల తర్వాత కూడా 30 శాతం పనులు పూర్తి చేయలేదు. కరోనా తర్వాత సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటి వరకు గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తికాగా, మొదటి, రెండో ఫ్లోర్‌లో సీలింగ్ పనులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు కేవలం రూ.2,12,51,201 విలువైన పనులు మాత్రమే పూర్తి చేశారు. మొత్తం మీద రూ.3.12 కోట్ల వ్యయం చేసినట్లు నిర్మాణ కంపెనీ ప్రకటించింది. నిర్దేశించిన కాల పరిమితిలో సదరు నిర్మాణ సంస్థ సర్వీస్ బ్లాక్ పూర్తి చేయకపోవంతో ఏపీ ఎంఎస్‌ఐడీసీ సంస్థ, శివరామ్ అండ్ కోతో ఒప్పందం రద్దు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ సర్వీస్ బ్లాక్ నిర్మాణం తన సొంత నిధులతో పూర్తి చేయిస్తామని పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు ముందుకు వచ్చారు. దీంతో ప్రభుత్వం కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. త్వరలో భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

రేకుల షెడ్డులో భారీ పేలుడు

- గదిలో చెలరేగిన మంటలు
- వృద్ధ దంపతులకు గాయాలు



పేలుడుకు ఎగిరిపోయిన రేకులు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో భారీ విస్ఫోటనం సంభవించింది. షేక్ గన్ సైదా కుటుంబం బ్రాడీపేట 6/18లో రేకుల షెడ్డులో నివాసం ఉంటుంది. ఒక గదిలో గన్ సైదా ఆయన భార్య మస్తాన్ బి ఉంటుండగా, మిగిలిన రెండు గదుల్లో కుమారుడు షరీఫ్ కుటుంబం ఉంటుంది. గన్ సైదా ఆటో డ్రైవర్‌గా, కుమారుడు షరీఫ్ కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. సోమవారం వేకువజామున 5.45 గంటల సమయంలో గన్ సైదా నివాసం ఉంటున్న గదిలో భారీ విస్ఫోటనం సంభవించింది. పేలుడు ధాటికి ఇంటి రేకులు పగిలిపోయాయి. తునాతునకలై పక్కనే ఉన్న రెండంతస్తుల డాబా దాటి అవతల ఇళ్లపై పడ్డాయి. మరో గది సీలింగ్ పగిలింది. గదిలో టీవీ పూర్తిగా దగ్ధమైంది. స్విచ్ బోర్డు కూడా తగలబడింది. పేలుడు శబ్దానికి చుట్టుపక్కల ఇళ్ల వారు భయాందోళనకు గురయ్యారు. ఇంటిలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. బట్టలు కాలిపోయాయి. మంచం తగలబడింది. సామగ్రి చెల్లాచెదురైంది. ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులైన గన్ సైదా, మస్తాన్ బి వంటికి మంటలు అంటుకున్నాయి. పక్క గదిలో ఉంటున్న కుమారుడు షరీఫ్, ఆయన భార్య వెంటనే మంటల్లో చిక్కుకున్న గన్ సైదా, మస్తాన్‌బి దంపతులను బయటకు తీసుకొచ్చారు. ఒంటిపై ఉన్న బట్టలకు మంటలు అంటుకోవడంతో వెంటనే ఆర్పేసి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారికి తీవ్ర గాయాలు అయినప్పటికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

అంతుచిక్కని పేలుడు కారణాలు

ఎందువల్ల పేలుడు సంభవించి ఉంటుందనేది అంతు పట్టడం లేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పేలుడుకు సంబంధించి ఎటువంటి ఆనవాళ్లు, ఆధారాలు లభించకపోవడంతో పట్టాభిపురం సీఐ వీరేంద్ర విద్యుత్తు, అగ్నిమాపక శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి గ్యాస్ లీక్ కాలేదని తేల్చారు. అదేవిధంగా విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కూడా జరగలేదని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇంటెలిజెన్స్ వర్గాలకు కూడా ఎటువంటి ఆధారాలు లభించలేదు. అయితే పేలుడు ఎలా సంభవించింది అనేది ప్రశ్నార్థకంగా మారింది. టీవీ పేలిందా లేక సెప్టిక్ ట్యాంకు గ్యాస్ లీకై ప్రమాదం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. క్లూస్ టీం కొన్ని ఆధారాలు సేకరించింది. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతామని అక్కడి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా పేలుడుకు సంబంధించిన కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

ఏజీ-బీఎస్సీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి మార్గదర్శకాలు జారీ

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి బీ) సీట్లును భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ(హానర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారితో నింపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45%పైగా మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ,ఎస్సీ,ఎస్టీలకు 40%పైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఒప్పందం



అవగాహనా ఒప్పంద పత్రాలతో వీఐటీ, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్లు

ఐనవోలు (తుళ్లూరు) జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించటం, పరిశోధన సహకారాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా వీఐటీ (వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)- ఏపీ విశ్వవిద్యాలయం, ఐఐటీ మద్రాస్ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది. రెంటి మధ్య విస్తృత ఒప్పందంగా గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ డీన్ రఘునాథన్ రంగస్వామితో మొదట ఒప్పందం, ఇండియా ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటీమద్రాస్) నేతృత్వంలోని ప్రతిష్ఠాత్మక ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్(ఐఎస్‌ఈఏ)ప్రాజెక్టు కింద వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయాన్ని స్పోక్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తిస్తూ రెండో అవగాహన ఒప్పందంపై వీఐటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వి కోటారెడ్డి ఐఐటీ నుంచి ఐసీఎస్ఆర్ డీన్ డాక్టర్ మను సంతానం సంతకం చేశారు. ఈ ఒప్పందాల వల్ల వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయం కీర్తి మరింత పెరుగుతుందని, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ ముదిగంటి అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్‌కు చెందిన ప్రముఖులు, వీఐటీకి చెందిన అమిత్‌చవాన్ డాక్టర్ సుధాకర్ ఇలంగో, డాక్టర్ శిబి చక్రవర్తి పాల్గొన్నారు.

సీఎం కృషితో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా



టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

నరసరావుపేట టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో విశాఖపట్నం ఉక్కుకు ఆర్థిక భరోసా వచ్చిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తరాంధ్రకే కాక యావత్ ఆంధ్రరాష్ట్రానికి మణిహారం విశాఖ ఉక్కు కర్మాగారం అన్నారు. వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్ అన్నారు. ప్లాంట్‌ను పునరుజ్జీవింపజేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. నాపై ఉన్న కేసుల నుంచి నాకు విముక్తి కల్పించండి, కావాలంటే మా రాష్ట్రాన్ని తాకట్టు పెడతానని సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లేవారని తెలిపారు. నేడు అందుకు భిన్నంగా సీఎం చంద్రబాబు నాయుడు హస్తినకు వెళ్లి వస్తున్నారని చెప్పారు. హస్తినకు వెళ్లివచ్చిన ప్రతీసారి రాష్ట్రానికి కేంద్రం గుడ్‌న్యూస్ చెప్తూనే ఉందన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖస్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజి ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితోపాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అప్పుడు నష్టాలలో ఉన్నప్పుడు కాపాడింది, నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో నుంచి స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించింది చంద్రబాబునాయుడే అన్నారు. వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా వారి మాటలను వినే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు



ప్రథమస్థానం సాధించిన పల్నాడు జిల్లా ఎడ్లజత


దుర్గి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 71వ కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని సోమవారం స్థానిక వినుకొండ రోడ్డులోని వేణుగోపాలస్వామి మాన్యంలో ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రెండు పళ్ల విభాగం పోటీలను మాచర్ల పట్టణంలోని రవితేజ హాస్పిటల్ వైద్యుడు గోనుగుంట్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ పోటీల్లో పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన జవ్వాజి మేఘనానాథ్ నాయుడు ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 3750 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడుకు చెందిన మూపర్తి నవీన్ ఎడ్లజత 3645 అడుగులతో రెండోస్థానం, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం హరవేదకోటకు చెందిన షేక్ దస్తగిరి ఎడ్లజత 3 వేల అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం 88 తాళ్లూరుకు చెందిన మలిశెట్టి ప్రవీణ్‌కుమార్ ఎడ్లజత 2585 అడుగులతో నాలుగోస్థానం, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం వంగపాడుకు చెందిన కైపా వెంకటరమణారెడ్డి ఎడ్లజత 2291 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి. రిఫరీలుగా గూడా శ్రీను, బండ్ల ప్రసాద్ వ్యవహరించారు. టీడీపీ నేత వంకమళ్ల కోటేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి, రుద్రాల రవి, రిటైర్డ్ లైన్‌మ్యాన్ వెలిదండి గోపాల్, కటకం రామ్మోహనరావు, గందె గోపాలరావు పర్యవేక్షించారు. మంగళవారం నాలుగుపళ్ల విభాగంలో పోటీలు జరుగనున్నాయి.

28 నుంచి రెండు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పోటీలు

రెంటచింతల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలోని 175 సంవత్సరాల కానుకమాత చర్చి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 28 నుంచి రెండు రాష్ట్రల స్థాయి ఎడ్ల పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు చర్చి ఆవరణలో కానుకమాత కోడె గిత్తల పోటీ నిర్వాహకులు సోమవారం పోస్టర్లను విడుదల చేశారు. 6 విభాగాల్లో పోటీలుంటాయని ఒక్కో విభాగానికి 9 రకాల బహుమతులుంటాయన్నారు. 3వ తేదీ వరకు పందేలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌ను చదును చేసినట్లు తెలిపారు. రాయలసీయ, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే ఎడ్ల పోటీల నిర్వాహకులకు వసతి కల్పిస్తామన్నారు. సుమారు రూ.15 లక్షల విలువ చేసే బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

బీసీల బాంధవుడు చంద్రబాబు


- ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బీసీల బాంధవుడు చంద్రబాబు అని, బీసీ సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమని శాసనమండలి సభ్యుడు దువ్వారపు రామారావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం బీసీ మంత్రుల అభినందన సత్కార కార్యక్రమ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిందనీ, టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 5 నెలల్లోనే కార్పొరేషన్ పదవులకు ఛైర్మన్లను నియమించడమే కాకుండా బీసీ కార్పొరేషన్‌కు నిధులు కూడా కేటాయించి చంద్రబాబు బీసీల మనిషి అని నిరూపించుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం కీలక మంత్రి పదవులు, ఛైర్మన్ పదవులలో బీసీలనే నియమించిందన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి ఈ నెల 27న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బీసీ మంత్రుల అభినందన సభ జరుపుతున్నామని తెలిపారు. సమావేశంలో టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, బండపల్లి శ్రీనివాసరావు, గంజం రాఘవేంద్ర, మల్లె ఈశ్వరరావు, ఉప్పుటూరి పేరయ్య, గుర్రపుశాల రామకృష్ణ, రాచకొండ నాగేశ్వరరావు, తుమ్మేటి మురళి తదితరులు పాల్గొన్నారు.

పులి జాడలు ఎక్కడా లేవు



అడవిలోకి వెళ్తున్న అటవీ సిబ్బంది

తుమ్మకోట(రెంటచింతల)జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తుమ్మకోట అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరించినట్లు పాద ముద్రలు ఏవీ లేవని శిరిగిరిపాడు సెక్షన్ బీట్ ఆఫీసర్లు విజయనిర్మల, సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆవుల మందపై పులి దాడి చేసిందన్న సమాచారంతో సోమవారం ఉదయం అటవీ సిబ్బంది తుమ్మకోట గ్రామస్థులు 15 మందితో కలిసి నెమలిశెల ప్రాంతంలో పర్యటించారు. అనంతరం బీట్ ఆఫీసర్లు మాట్లాడుతూ.. నెమలిశెల ప్రాంతంలో విస్తృతంగా గాలించామని, పులి జాడ ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదని స్పష్టం చేశారు. మందలోని లేగ ఆవుదూడ కొద్దిపాటి గాయంతో కనిపించగా దానిని పశువుల కాపరులకు అప్పచెప్పినట్లు తెలిపారు. మంద నుంచి తప్పిపోయిన లేగదూడ అరుపులకు ఆవులు భయపడి చెల్లాచెదురు కావడంతో, పశువుల కాపరులైన హస్సేన్ నాయక్, బాలు నాయక్ పులి వచ్చిందన్న అనుమానంతో కేకలు వేస్తూ పరారయ్యారని తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లతో పాటు లింగయ్య, నాసరయ్య, చెక్‌పోస్ట్ హెల్పర్ శివనాయక్ పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ ఎన్నిక

మంగళగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. గౌరవాధ్యక్షుడిగా ఎస్ఎస్ చెంగయ్య, అధ్యక్షుడిగా రమేష్, కార్యదర్శిగా ఎం.బాలాజీ, ఉపాధ్యక్షులుగా కేవీఎస్ కిరణ్, ఆర్.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా కె.బుజ్జిబాబు, డి.మనోజ్, కోశాధికారిగా జి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎయిమ్స్‌లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, ఒకే కుటుంబంలో ఐదుగురికి ఉద్యోగాలు ఇవ్వడం వలన కొత్త వారికి అవకాశం దక్కడం లేదని, అర్హత ఉన్న వారికి పబ్లిక్‌గా ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

23, 24, 25 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

గుంటూరు కార్పొరేషన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని మూడు వంతెనల వద్ద సంగంజాగర్లమూడి నుంచి నాజ్ సెంటర్ రిజర్వాయర్‌కి తాగునీటి సరఫరా చేసే పైప్‌లైన్ మరమ్మతు పనుల వల్ల ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ఉదయం సరఫరా అనంతరం మరమ్మతు పనులు చేపట్టడానికి జీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని చెప్పారు. పైప్‌లైన్ మరమ్మతు పనుల వల్ల నాజ్‌సెంటర్ (ఎల్ఎల్ఆర్) రిజర్వాయర్ పరిధిలోని పొత్తూరివారితోట, గుంటూరువారితోట, కొత్తపేట, రాజాగారితోట, సాంబశివరావుతోట, రామిరెడ్డితోట, ప్రకాష్‌నగర్, రైల్‌పేట, గణేష్‌రావుపేట, అహ్మద్‌నగర్, శీలంవారి వీధి, లాలాపేటలో కొంత ప్రాంతం, పట్నంబజార్‌లో కొంత ప్రాంతం, చౌత్ర సెంటర్‌లో కొంత ప్రాంతం, ఏటుకూరు మెయిన్‌రోడ్, చిన్నబజార్‌లోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. తిరిగి 25 సాయంత్రం పాక్షికంగా, 26 నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు) జనవరి 20(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభల పోస్టర్లను పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

'మాలలకు ఉపముఖ్యమంత్రి పదవి కేటాయించాలి'

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడానికి గత ఎన్నికల్లో మెజారిటీగా ఉన్న మాలలు కీలక పాత్ర పోషించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ తెలిపారు. గుంటూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో కూటమి గెలుపునకు క్రియాశీలకంగా పని చేసిన మాలలకు గత ప్రభుత్వంలో ఇచ్చిన విధంగా ఉప ముఖ్యమంత్రి పదవిని ఈ ప్రభుత్వంలో కూడా మాలలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ తదితరులున్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల శిక్షణకు డీపీటీవో

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశపెట్టబోతున్న నేపథ్యంలో ఈ మేరకు శిక్షణ కోసం జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ బెంగళూరుకు వెళ్లారు. ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీలో ప్రవేశపెడుతున్న నేపథ్యంలో అధికారులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల పాటు బెంగళూరులో జరుగనున్న శిక్షణ కార్యక్రమానికి రవికాంత్ వెళ్లారు. ఇన్‌ఛార్జ్ డీపీటీవోగా పల్నాడు జిల్లా డీపీటీవో ఎస్.శ్రీనివాసరావు వ్యవహరించనున్నట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

బుడమేరు బాధితులకు ఖర్చుచేసిన నిధులపై నివేదిక ఇవ్వాలి : మేయర్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బుడమేరు బాధితుల సహాయార్థం ఖర్చు చేసిన నిధులపై నివేదిక ఇవ్వాలని నగర మేయర్ మనోహర్ నాయుడు కోరారు. సోమవారం ఈ మేరకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి కమిషనర్ పులి శ్రీనివాసులుపై ఫిర్యాదు చేశారు. మేయర్ మాట్లాడుతూ ఈ నిధులపై చర్చకు వస్తే కౌన్సిల్ నుంచి వెళ్లిపోయారు అని అన్నారు. పలుమార్లు కౌన్సిల్ నిర్వహిద్దామన్నా కమిషనర్ హాజరు కాలేదని, 16న స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారని అన్నారు. కమిషనర్ కాకుండా ఉన్నతాధికారి పర్యవేక్షణలో ఎన్నికలు జరపాలి, కమిషనర్ అవినీతిపై ముఖ్యమంత్రి నుంచి ప్రధాని వరకు అందరికి లేఖలు రాశామని అన్నారు. కమిషనర్ అవినీతి బండారం బయటపెడతాం అని మేయర్ అన్నారు. డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు, వైసీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

'ఎక్స్'లో డీఆర్డీఏ సమాచారం

గుంటూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నేటి యువత ఎక్కువగా సోషల్ మీడియాలో ఉంటుంది. వారికి అవసరమైన సమాచారం అక్కడ అందుబాటులో ఉంచితేనే ఎక్కువ మందికి తెలుస్తుంది అని భావించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కొత్త ప్రయోగానికి తెరలేపింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందిన ముఖ్య సమాచారం అంతా 'ఎక్స్'లో ఉంచేందుకు ఏర్పాటు చేశారు. గ్రామీణాభివృద్ధి సంస్థ పేరు తో ప్రత్యేకంగా ఖాతా తెరిచినట్లు డీఆర్డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. యువతీ, యువకులు ఈ అకౌంట్‌ను ఫాలో కావాలని విజ్ఞప్తి చేశారు. అందులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా చేపట్టే శిక్షణ, ఇతర కార్యక్రమాల వివరాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం శ్రీత్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమాల్లో భాగంగా తొలుత లఘు కచేరీలలో గుండూరి శ్రీనివాసమూర్తి శిష్య బృందం వారి వయోలిన్ వాదన సంగీతాభిమానులను అలరించింది. సాయంత్రం ప్రధాన కచేరీ నిర్వహించిన రాఘవాచారి ప్రధాన శాస్త్రీయ సంగీత కచేరీలో అనేక త్యాగ రాజ కీర్తనలను గానం చేసి ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఎస్ గిరిజాశంకర్ ఆరాధనోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయిని పెంచాలి

● కలెక్టర్ నాగలక్ష్మి
● ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 172 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అందిన అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు కృషి చేయాల ని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమా వేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 172 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, ఆర్డీవో కే శ్రీనివాసరావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సంతృప్తి స్థాయి తక్కువగా ఉన్న శాఖల అధికారులతో ప్రతి బుధవారం సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జేసీ భార్గవతేజ్ మాట్లాడుతూ కోర్టు కేసులను సమీక్షిస్తూ కోర్టులకు ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జరుగుతున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో ప్రతి అధికారి పాల్గొని వారి శాఖల సిబ్బందికి అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, డీఎస్‌వో కోమలి పద్మ, డీపీవో నాగసాయికుమార్, డీసీవో వీరాచారి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిలీ ప్రెస్ అక్రమాలపై రిపోర్టును బహిర్గతం చేయాలి

స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో ఉన్న బ్రెయిలీ ప్రెస్‌లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం నియమించిన అధికారి ఇచ్చిన రిపోర్టును బహిర్గతం చేయాలని విజువల్లీ ఛాలెంజ్‌డ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధులు అర్జీ అందజేశారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రత్నరాజు మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వంలో బ్రెయిలీ ప్రెస్‌లో పుస్తకాల ముద్రణ నిలిపివేశారని, దీంతో అంధ విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డా రని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నరసింహారావు, ఏ.రాజు, కే.శ్రీనివాసరావు, బాలస్వామి తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీలపై రుణాలు అందించాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఆయా కార్పొరేషన్‌ల ద్వారా అర్హులైన వారికి సబ్సిడీ ద్వారా రుణాలు అందించాలని రాష్ట్రీయ మహాజన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం ఆనంద్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనైనా ఆయా కార్పొరేషన్‌లకు నిధులను కేటాయించి, ఎటువంటి నిబంధనలు లేకుండా రుణాలు అందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సమితి సభ్యులు పిల్లి రాంబాబు, కంతేటి కోటేశ్వరరావు, గర్నెపూడి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

న్యాయవాదిని చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

పొన్నూరులో న్యాయవాదిని చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాయర్లు అర్జీ అందజేశారు. జిల్లా బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ కేసును పక్కదారి పట్టించేందుకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని అందుకే కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించామని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీనియర్ న్యాయవాది వైకే, శాంతకుమార్ తదితరులు ఉన్నారు.

త్రిపురనేని చిట్టిబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

రజక కులాన్ని చాకలోడు అంటూ దూషించిన ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సినీ దర్శకుడు చిట్టిబాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రజక వృత్తి ధోబి ఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చెన్నూరి చెన్నయ్య అర్జీ అందజేశారు. ఈ మధ్యనే జరిగే టీవీ డిబెట్‌లో జరిగిన చర్చలో అయన అనేక మార్లు రజక కులాన్ని కించపరుస్తూ మాట్లాడారని అన్నారు.



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఆచార్య గంగాధర్, డాక్టర్ బి.శివశిరీష

వర్సిటీతో సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఒప్పందం

గుంటూరు(విద్య), జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యా సంస్థ సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం జరిగింది. దీని ద్వారా సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ యూనివర్సిటీలోని హెల్త్ సెంటర్ ద్వారా విశ్వవిద్యాలయం ఉద్యోగులు, విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్స, విశ్వవిద్యాలయ అథ్లెటిక్స్‌కు స్పోర్ట్స్ ఇంజ్యూరీ రిహాబిలిటేషన్ సేవలకు సంబంధించి ఈ అవగాహన ఒప్పందం జరిగింది. సిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూ షన్స్ సెక్రెటరీ, కర స్పాండెంట్ బి.శివశిరీష మాట్లాడుతూ తమ విద్యాసంస్థలకు ఈ అవకాశం కల్పించినందుకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గంగాధర్, రిజిస్ట్రర్ ఆచార్య సింహాచలం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ రెక్టార్ రత్నాశీలమణి, సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ జి.క్రిస్టీకిరణ్, యూనివర్సిటీ స్పోర్ట్స్ కాలేజ్ డైరెక్టర్ పి.పాల్‌కుమార్, ప్రిన్సిపాల్ జాన్సన్, విజయకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సర్వీస్ బ్లాక్ నిర్మాణంపై పెమ్మసాని హర్షం

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు జనరల్ ఆస్పత్రిలో రూ.10 కోట్లతో సర్వీస్ బ్లాకు నిర్మాణాన్ని చేపట్టడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంతి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.10 కోట్లతో జీజీహెచ్ లో సెంట్రల్ కిచెన్, ఆస్పత్రి కోసం సర్వీస్ బ్లాక్, దుకాణాలు, మెకనైజ్డ్ లాండ్రీ, ఎండీఆర్, సీఎస్ఎస్‌డీ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. సర్వీస్ బ్లాక్‌లో పూర్తి ఫర్నీచర్, జీప్లస్ వన్ స్ట్రక్చర్‌ను తమ సొంత ఖర్చులతో నిర్మించేందుకు ముందుకు వచ్చిన తులసి రామచంద్ర ప్రభును ఆయన అభినందించారు.

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను మున్నంగి జగదీష్ విరాళంగా ప్రకటించారు. సోమవారం స్థానిక బృందావన్‌గార్డెన్స్, కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మున్నంగి జగదీష్ మాట్లాడుతూ మా నాయనమ్మ మున్నంగి మహాలక్ష్మి జ్ఞాపకార్థం ఈ విరాళం అందజేసినట్టు తెలిపారు. వడ్లమూడి నాగేంద్రం మాట్లాడుతూ వసతి గృహానికి దాతలు తామకు తాముగా వచ్చి ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఘంటా పున్నారావు, మద్రిపూడి సీతారామయ్య, పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా లేబర్ లైన్ చైతన్య ప్రచార రథ యాత్ర ప్రారంభం

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ), ఇండియా లేబర్ లైన్ సంయుక్తంగా ఇండియా లేబర్ లైన్, చైతన్య ప్రచార రథయాత్రను గోరంట్లలోని డీబీఆర్‌సీ కార్యాలయం నుంచి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమస్యలపై అవగాహన కల్పించి, వేతన సమస్యలను నమోదు చేసుకుని వాటిని పరిష్కరించడం, ఈ ప్రచార రథం ప్రధాన ఉద్దేశమని డీబీఆర్‌సీ డైరెక్టర్ అల్లడి దేవకుమార్ తెలిపారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హనుమంత్‌సాయి, డీబీఆర్‌సీ డిప్యూటీ డైరెక్టర్ చుక్క శామ్యూల్ అనిల్ కుమార్, ఇండియా లేబర్ లైన్ స్టేట్ కోఆర్డినేటర్ మాధవరావులు ప్రసంగించారు. నల్లపాడు, అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ వీరస్వామి, వంశీధర్‌లు లేబర్ లైన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లేబర్ లైన్ గుంటూరు ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, విజయవాడ ఫీల్డ్ ఆఫీసర్‌లు ఈశ్వర్, కనకదుర్గ, యశ్వంత్‌లు ఉన్నారు.

ఉద్యోగులకు హెచ్ఆర్‌సీ పాలసీ అమలుచేయాలి

గుంటూరు(తూర్పు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగు లకు హెచ్ఆర్‌సీ పాలసీ అమలు చేయాలని ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు టీ అంజయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికై సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యను పరిష్కరించకపోతే 27న విజయవాడ, రాష్ట్ర సహకార బ్యాంకు ఎదుట భారీ నిరసన చేపడుతున్నట్టు తెలిపారు. అప్పటికి పరిష్కారం కాకపోతే ఫిబ్రవరి 10నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నిరసనల్లో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ క్యాబినెట్లోని మంత్రులంతా జైలుకే : కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి క్యాబినెట్లో పనిచేసిన మంత్రులంతా త్వరలో జైలు కెళ్లక తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ చేసిన నేరాలకు కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా వారు ఇక కట్టు బానిసల్లా పడి ఉండాల్సిందే నని అన్నారు. ప్రజలు ప్రతిపక్ష హోదాకూడా ఇవ్వకుండా కర్రు కాల్చి వాతెందుకు పెట్టారో ఆత్మపరిశీలన చేసుకోకుండా అచ్చోసిన ఆంబో తులా రంకెలు వేయడం అంబటి రాంబాబుకు తగదని అన్నారు. 13 కోట్ల ప్రభుత్వ ఖర్చుతో జగన్ తాడేపల్లి ప్యాలెస్‌కు వేసిన ఇనుప ఫెన్సింగ్ విషయం తెలుసుకొని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆశ్చర్యపోయారని, విశాఖలోని రిషికొండపైన 700 కోట్లతో, 30 పడక గదులతో ప్యాలెస్ నిర్మించటమే కాక ఇలాంటివే హైదరాబాద్, బెంగళూర్, ఇడుపులపాయల్లో కూడా నిర్మించుకున్నాడని బీజేపీ నేతలు ఆయన దృష్టికి తేగా 'అదో రకమైన మానసిక జబ్బని, ఎన్ని ప్యాలెస్‌లు కట్టుకున్నా చివరకు జగన్ ఉండాల్సింది జైల్లోనే'గా అని అమిత్‌షా వ్యాఖ్యానించిన మాటను ఆయన గుర్తు చేశారు. వైఎస్ కుటుంబం కోసం ప్రాణాలు తీసుకోవడానికి కూడా వెనకాడని నాయకులు కొండా సురేఖ, బాలినేని, సూరీడు లాంటివారిని కూడా తీవ్రంగా అవ మానించి బయటకు పంపిన నీచుడు జగన్‌రెడ్డని కనపర్తి విమర్శించారు.

ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



ఏటీ అగ్రహారం రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఏటీ అగ్రహారం విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని, విస్తరణ పూర్తయిన ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులను తక్షణం ప్రారంభించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్ విస్తరణ పనులను, పట్టాభిపురం మస్టర్ పాయింట్, దుర్గానగర్ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ తొలుత చుట్టగుంట సెంటర్ నుంచి కంకరగుంట ఆర్‌యూబీ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి నెలాఖరు లోపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ మధుసూదనరావు, ఆర్‌వో రెహ్మాన్, కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

10 తేదీకల్లా మూడు వంతెనల వద్ద పనులు పూర్తి కావాలి

నగరంలోని డొంక రోడ్డు మూడు వంతెనల వద్ద రైల్వే శాఖ చేపట్టిన నూతన ట్రాక్ ఎక్స్‌టెన్షన్ పనులు ఫిబ్రవరి 10 నాటికి పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, ఇప్పటికే ట్రాఫిక్ రద్దీతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రైల్వే అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ తమ చాంబర్‌లో రైల్వే, జీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, పట్టణ ప్రణాళిక అధికారులతో పనుల పురోగతి, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రైల్వే ఏడీఎన్ జగన్మోహనరావు, ఎస్ఎస్ఈ వెంకటేశ్వరరావు, జీఎంసీ ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ కళ్యాణరావు, ఏసీపీ రెహ్మాన్, ట్రాఫిక్ సీఐ సింగయ్య పాల్గొన్నారు.

డయల్ యువర్ కమిషనర్ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను బాధ్యతగా అధికారులు సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రజల నుంచి అందిన 15 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వ హించిన పీజీఆర్ఎస్‌కు 48 ఫిర్యాదులు అందాయని వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంవో హెచ్ డాక్టర్ అమృతం, మేనేజర్ బాలాజీ బాషా, ఆర్‌వోలు పాల్గొన్నారు.

జెస్సీరాజ్‌కు కలెక్టర్ అభినందనలు



జెస్సీరాజ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్కేటింగ్ పోటీల్లో సత్తాచాటిన జిల్లాకు చెందిన జెస్సీరాజ్‌ను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. డీఎస్‌డీవో నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు తూర్పున ఎటుచూసినా అభివృద్ధి

● ఎమ్మెల్యే నసీర్ ● గుంటూరువారితోటలో రూ.1.70 కోట్లతో పనులు ప్రారంభం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన ఏపీఐడీసీ చైర్మన్ డేగల

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎటు చూసినా అభివృద్ధే కనిపిస్తోందని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని ఆరో డివిజన్ గుంటూరువారితోటలో రూ.1.70 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని చెప్పడానికి గర్వంగా ఉందని అన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతోపాటు సమగ్రాభివృద్ధి జరుగుతోందని చెప్పారు. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని, పారిశ్రామిక రంగం పరుగులు పెడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సమత, డిప్యూటీ మేయర్ సజీలా, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, పోతురాజు చంద్ర, ఫిరోజ్, డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, కొత్తూరు వెంకట్, కొనకల్ల సత్యం, విజయ్, హనుమాన్‌బాబు, వేదాంతం శ్రీను, వలి, మున్సిపల్ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం

● ఎమ్మెల్యే గళ్లా మాధవి ● రూ.2.02 కోట్ల విలువైన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెలే గళ్లా మాధవి

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందుతోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గంలోని 25వ డివిజన్ వీబీసీ రోడ్డులోని కమ్యూనిటీ హాల్ వద్ద, 39వ డివిజన్ పలకలూరు రోడ్డు కృష్ణబాబు కాలనీలో రూ.2 కోట్ల 2 లక్షల అంచనాలతో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్లలో అసంపూర్తిగా నిలిచిన పనులను పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జోసెఫ్‌నగర్‌లోని పాఠశాలను సందర్శించారు. సీఎం చంద్రబాబు, మంతి లోకేశ్ దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకువస్తారని ఎమ్మెల్యే గళ్లా మాధవి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గాలం వెంకటేశ్వర్లు, సింగంసెట్టి వీరయ్య, కదిరి సంజయ్, కసుకుర్తి హనుమంతరావు, ముత్తినేని రాజేష్ పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి : లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, కార్మిక గొంతును మండలిలో వినిపించేందుకు పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. సోమవారం, స్థానిక బ్రాడీపేటలోని కొరటాల సమావేశ మం దిరంలో సీఐటీయూ అఖిల భారత పూర్వ అధ్యక్షుడు ఈ బాలానందన్ శత జయంతి సందర్భంగా ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సుకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మండలిలో ఉద్యోగ, కార్మిక, ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పీడీఎఫ్ పోరాటం చేస్తుందని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం సీఐటీయూ అనుబంధ సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో బేబిరాణి, పీ అజయ్‌కుమార్, కే సుబ్బరావమ్మ, కే ఉమామహేశ్వరరావు, ఆర్‌వీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కేఆర్‌కే ఈవెంట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ 20వ నాటకోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి పుట్టగుంట ప్రభాకర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా ఎల్‌వీఆర్ క్రియేషన్స్ గుంటూరు వారు బత్తినేని సుభాష్ రచన, దర్శకత్వం వహించిన 'వీళ్ళ నటన పాడుగాను' హాస్య నాటిక, సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారు స్నిగ్ధ రచనకు, మంజునాధ్ దర్శకత్వం వహించిన 'జేబు చెప్పిన ఊసులు' నాటికను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పరిషత్ నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, బొప్పన నరసింహారావు(బుజ్జి) జి.మల్లికార్జునరావు, వేములపల్లి విఠల్ కళాకారులను సత్కరించారు.

ఎస్పీ కార్యాలయానికి వినతుల వెల్లువ

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆయన సోదరుడు మురళీకృష్ణ తదితరులపై చట్ట ప్రకారం నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని జై భీమ్ కార్మిక సంఘం నాయకుడు పిల్లి బాబురావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తమ సంబంధించిన జూట్ మిల్ స్థలాన్ని వారు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని కబ్జా చేశారని, అయితే తమపై దాడి చేయించిన ఘటనలో తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

● మల్లికార్జున పేటలో గత నవంబర్ 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన కార్యంశెట్టి శ్రీదేవి కేసులో నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లను చేర్చి నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఆయా సంఘాల నాయకులు పోలీసులు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు.

● తక్కువ పెట్టుబడికి అధిక లాభాలు వస్తాయంటూ ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి ట్రాప్ చేసి పలువురు బాధితులను లక్షల్లో ముంచాడు. దీంతో ఏటి అగ్రహారం పరిధిలోని రామిరెడ్డినగర్ కు చెందిన ఎం.హనీప్రియ సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.

● యడ్లపాడు -1 వీఆర్వో గా పనిచేస్తున్న షేక్ మహబూబ్ సుభాని తమ నుంచి 20 లక్షలు తీసుకొని మోసం చేశాడని బొప్పుడి కి చెందిన షేక్ మౌలా బుడే ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

● శాంతినగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏ వెంకటేశ్వర్లు తన నుంచి పది లక్షల 40 వేలు డబ్బులు తీసుకొని ఇప్పుడు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని బ్రాడీపేట 1/2కు చెందిన వృద్ధురాలు వెంకట నారమ్మ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

● దేవాపురం 2వ లైన్‌లో ఏనుగుల ఆనందబాబు (31) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలో భార్య విజయలక్ష్మి పుట్టింటికి వెళ్ళిపోయింది. మనస్థాపానికి గురైన ఆనందబాబు ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

బహిరంగ ప్రకటన

నాక్షయింటు అయిన గుంటూరు సిటీ,కృష్ణనగర్ 2వ లైను, భవ్య రెసిడెన్సీ, ఫ్లాట్ నెం.501, డోర్.నెం. 3-29-39 కాపురస్తులు పోళ్ల చలపతిరావు గారి కుమారుడు గంగాధరరావు గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియ జేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నాక్షయింటు డి.22-02-2014న విక్రయ దస్తావేజు నెం.383/2014 యస్.ఆర్.ఓ.తాడికొండద్వారా మల్లవరపు శ్రీనివాసరావు గారి వద్ద నుండి క్రయం పొంది ఆ తదాది నేటి వరకు సర్వ సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్న ఆస్తిని కుటుంబ అవసరముల నిమిత్తం విక్రయించుకొనదలచినారు. కావున ఎవరికైనా షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు,తాకట్లు, కోర్టుజప్తులు వగైరా ఉన్న యెడల ఈ ప్రకటన తేది నుండి 7రోజుల లోగా నాకు గాని, నాక్షయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారాలతో లిఖిత పూర్వకముగా తెలియజేయగలరు. గడువులోగా ఎట్టి క్షయిములు రానియెడల షెడ్యూలు ఆస్తి నిష్పేచి ఆస్తిగా భావించి నాక్షయింటు బహిరంగంగా విక్రయించుకొనగలరు. తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు షెడ్యూలు ఆస్తిని గాని, నాక్షయింటు హక్కులను గాని బైండుచేయజాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥, తాడికొండ సబ్.డి., తుళ్ళూరు రెవిన్యూ మండలం లో చేరిన తుళ్ళూరు గ్రామ పంచాయతీ యిలాకా, తుళ్ళూరు గ్రామ కంఠం తాలూకు డి.నెం.76/ఏ2రు ఎకరు మింజుమలెకు సరియగు తుళ్ళూరు గ్రామ పంచాయతీ పాత బ్లాకు 2, డోరు.నెం.3రుగల, కొత్త బ్లాకు నెం.2రు. డోర్.నెం.10రుగల చ.గ.370.5లు ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు:తూర్పు:** సర్కారు బజారు హద్దు,అ.27-9లు, **దక్షిణం:**చెరుకూరి ఆదియ్య యింటి గోడ హద్దు,అ.78 లు, **పడమర:** సర్కారు బజారు హద్దు, అ.42-9లు, **ఉత్తరం:** మేకల అంకులయ్య స్థలము హద్దు,అ.60లు,**తిరిగి దక్షిణం:**మేకల నాగేశ్వర రావు, మేకల అంకులయ్య గారల స్థలము హద్దు,అ.24లు, **తిరిగి ఉత్తరం:**డిటో వారి స్థలము హద్దు అ.18లు.

D. SOURI BABU, Advocate,
Flat no:1B, Royal Tulip Apartment, 5th line,
SVN colony, Guntur-522006. Cell:9059644446

చంద్రకళ ఏదీ?

● నాటి చరిత్రను తెలిపే చిహ్నాలు కనుమరుగు
● ఎండిన మొక్కలు.. శిథిలమైన ఆట వస్తువులు
● ఆహ్లాదం.. ఆనందం కరవు
● ఇదీ చంద్రకళాపార్కు దుస్థితి


ఆహ్లాదం లేకుండా చెట్లు, మొక్కలు తొలిగించి ఉన్న బాపట్ల రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని చంద్రకళాపార్క్

బాపట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చరిత్ర కలిగిన బాపట్ల చంద్రకళాపార్క్ కళ తప్పింది. ఘనచరిత్ర కలిగిన ఈ పార్క్ బాపట్ల రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉంది. బాపట్ల పురపాలక సంఘం పరిధిలోని ఈపార్క్‌ను 1950 అక్టోబరు 2న ప్రారంభించారు. అప్పటి మద్రాస్ రాష్ట్ర ఆంధ్రమంత్రులు కల్లూరి 'చంద్ర'మౌళి, 'కళా' వెంకట్రావు పేర్లు మీద దీనిని ఏర్పాటు చేశారు. బాపట్ల గ్రామ పంచాయతీ వారు నాటి సర్పంచి డాక్టర్ చదలవాడ సుబ్బారావు నేతృత్వంలో పార్క్ ఏర్పాటు చేశారు. అప్పటి శాసన సభ్యుడు మంతెన వెంకటరాజు ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రాంతంలో జాతీయ నాయకులు అనేకమంది సభలు, సమావేశాలు ఏర్పాటు చేయగా వాటిల్లో పాల్గొన్నారు. బాపట్లకు ఒక ప్రత్యేక గుర్తింపుగా చంద్రకళాపార్క్ ఉండేది. పార్క్‌లో అనేక రకాల ఆట వస్తువులు, మొక్కలతో ఆహ్లాదకరంగా ఉండేది.

● పార్క్‌లో గ్రంథాలయం

చంద్రకళాపార్క్‌లో గ్రంథాలయం ఉండేది. ఇది బాగా ప్రసిద్ధి చెందింది. అందులో ఉండే రేడియో ద్వారా సాయంత్రం మైక్‌లో వార్తలు వినిపించేవారు. స్వాతంత్రోద్యమ సభలు కూడా ఈ ప్రాంతంలో అనేకం జరిగేవి. ఈ పార్క్‌లో 1954 అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్ర ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పట్టణ ప్రథమ మున్సిపల్ చైర్మన్ వెలగపూడి సుబ్బారావు జయస్థూపాన్ని నెలకొల్పారు. అందులో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ విషయాన్ని ప్రస్తావించారు. 1950కు ముందు ఇక్కడ జిట్టా అప్పయ్య రీడింగ్‌రూమ్ నిర్వహించేవారు. వేలాది మంది విద్యార్థులు, పాఠకులు ఇక్కడ పుస్తకాలు, పత్రికలు చదివి విజ్ఞానాన్ని సముపార్జించేవారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కిక్కిరిసిన జనంతో ఆహ్లాదకరంగా ఉండే ఈపార్క్ నేడు కళాహీనంగా మారింది.

● వైసీపీ హయాంలో పార్కు తొలగింపు

అటు రైల్వేస్టేషన్ ఇటు ఏరియా వైద్యశాల మధ్య కావాల్సినంత విస్తీర్ణంలో చంద్రకళాపార్క్ అందులో లైబ్రరీ, పాఠశాల, ఆటవస్తువులు, ఆహ్లాదాన్ని పంచే అనేక వస్తువులు ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాఫిక్ సమస్యను అధికమించేందుకు పాతబస్టాండ్ నుంచి డీఎస్పీ కార్యాలయం మీదుగా చంద్రకళాపార్క్‌లో నుంచి మార్కెట్ మీదుగా జీబీసీ రోడ్డుకు అనుసంధానం చేస్తూ వన్‌వేరోడ్డు నిర్మించారు. ఆ సమయంలో పార్క్ మొత్తం తొలిగించారు. అందులో ఉన్న పాఠశాలతోపాటు రీడింగ్‌రూమ్ కూడా తొ లిగించారు. రోడ్డు వేయగా దారి పొడువున ఉన్న కొద్ది స్థలం లో పార్క్‌ను అభివృద్ధి చేశారు. నిర్వాహణ మాత్రం వదిలేశారు. దీంతో పార్క్‌లో పెంచిన మొక్కలు ఎండిపోయాయి. ఆట వస్తువులు శిథిలమయ్యాయి. ఆహ్లాదం లేకుండా పోయింది. ఒకప్పుడు కళకళలాడే చంద్రకళా పార్క్ నేడు కళతప్పి కనిపిస్తున్నది. కూటమి నాయకులు దీనిని అభివృద్ధి చేసేందు కు పక్కనే ఖాళీగా ఉన్న రైల్వేస్థలాన్ని కూడా కలిపి ఆహ్లాదకరంగా అభివృద్ధిచేయాలని బాపట్ల ప్రజలు కోరుతున్నారు.



చంద్రకళాపార్కులో 1950వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్, లైబ్రరీ శిలాఫలకం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐడీ ఎస్పీ సరిత, పక్కన బ్యాటింగ్ చేస్తూ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం





క్రీడాస్ఫూర్తితో మెలగాలి

● సీఐడీ ఎస్పీ సరిత
● భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం

గుంటూరు(విద్య), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గెలుపు ఓటముల్ని క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని అప్పుడే జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని సమర్థవంతంగా పరిష్కరించుకునే నైపుణ్యాలు అలవడుతాయని సీఐడీ ఎస్పీ సరిత అన్నారు. సోమవారం గోరంట్లలోని భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో కేఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ బీపీఎల్ 2024-25 పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ సరిత మాట్లాడుతూ అపజయాల నుంచి పాఠాలు నేర్చుకుంటేనే విజయాలు దరిచేరతాయన్నారు. క్రికెట్ కేవలం క్రీడ మాత్రమే కాదనీ, జట్టును సమర్థవంత నాయకత్వంతో నడిపించి సమష్టిగా విజయం సాధించడమేనని అన్నారు. జట్టును స్ఫూర్తివంతంగా, నాయకత్వ లక్షణాలతో నడిపించడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, పోరాట పటిమ క్రికెట్ ద్వారా పెంపొందుతాయని అన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక వికాసానికి దోహదపడతాయని అన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించేందుకు భాష్యం ప్రీమియర్ లీగ్ ప్రారంభించామని తెలిపారు. భాష్యం 150 బ్రాంచీలలో 2021 నుంచి ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ టోర్నమెంట్లో భాగంగా ప్రిలిమినరీస్ జనవరి 20న, క్వార్టర్ ఫైనల్స్ 23, సెమీ ఫైనల్స్ 25, ఫైనల్స్ 26వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలి రోజు ఉదయం ప్రిలిమినరీ మ్యాచ్లో గుంటూరు జెయింట్స్-3, వైజాగ్ చికింగ్-1 తలపడగా గుంటూరు జెయింట్స్- 3 జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం గుంటూరు గార్డియన్స్-2, ఈస్ట్ గోదావరి ఏభైల్స్-3 జట్లు తలపడగా గుంటూరు గార్డియన్స్-2 జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన జట్టుకు సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత రామ్ తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన క్రీడాకారులతో భాష్యం రామకృష్ణ, భాష్యం హనుమంతరావు తదితరులు



అడిగింది ఇస్తేనే.. అప్రూవల్

(5వ పేజీ తరువాయి)

వాహన బీమా, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటివి మంజూరు చేయటం దగ్గర నుంచి ఈ-కేవైసీ వంటివాటి వరకు వాహనదారులు అన్నీ ఆన్‌లైన్‌లో చేసుకునే వెసుబాటు ఉంది. కేంద్రం కొత్త యాప్ తీసుకొచ్చి సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తోంది కదా! ఎంచక్కగా ఇంటిదగ్గరే ఉండి అన్నీ చేసుకోవచ్చునుకునే వారికి మాత్రం నిరాశ తప్పటంలేదు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని కొన్ని కార్యాలయాల్లో రెండు నుంచి నాలుగు నెలలుగా ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయంటే పరిస్థితి అర్థమవుతుంది. లారీలు, బస్సుల వంటి వాహనాలు బ్రేక్ చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ప్రభుత్వ చలానా రూ.970 చెల్లించాలి. ఇది రెండు నెలల ఫీజు. ఈ మొత్తం చెల్లించి అన్ని కాగితాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, వాహనాన్ని చూపితే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలి. కానీ చలానా మొత్తం కాకుండా అదనంగా రూ.3వేలు మామూళ్ల కింద చెల్లించాలి. ఇది ఎప్పటినుంచో ఉన్న ఆనవాయితీనే. అయితే వాహన్ యాప్ ద్వారా కేంద్రం కొత్త అవకాశాన్ని తీసుకొచ్చింది. నేషనల్ పర్మిట్, అంతర్రాష్ట్ర అనుమతులున్న లారీలకు పర్మిట్ అయిపోతే దానిని ఎక్కడ ఉంటే ఆ దగ్గర్లోని ఆర్టీఓ కార్యాలయంలో రెన్యువల్ చేయించుకునే అవకాశాన్ని కల్పించింది. అయితే ఎక్కడో విశాఖ జిల్లా బండి తెనాలిలో రెన్యువల్ చేసుకోవాలంటే అన్ని ఫీజులు, గతంలోనే నిర్ణయించిన లంచాలకు తోడు అదనంగా రూ.1500 నుంచి రూ.2వేల వరకు చెల్లించుకోవలసిందే. అదేమని ఎవరైనా అడిగితే ఎక్కడి వాహనం అక్కడ చేయించుకునేందుకు వెళితే ఆయిల్ ఖర్చు చాలా అవుతుంది కదా! మీకు అదంతా ఆదా చేస్తున్నాం కదా అని చెప్పి వసూలు చేయటం విశేషం.

ఫీజు చెల్లించినా ఆర్‌సీ కార్డులేవ్

కొత్త వాహనం రిజిస్ట్రేషన్ చేసుకుంటే దానికి సంబంధించిన ఆర్‌సీ కార్డ్ వాహన యజమానికి అందాలి. దీని కోసం 2023 నుంచి కొత్త వాహనాలు కొన్నవారంతా ఎదురుచూస్తున్న పరిస్థితి. కార్డ్ కావాలంటే రూ.225 చెల్లించాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వ కాలంలో కార్డ్‌తో పనిలేకుండా ఆర్‌సీ పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని దానిని కార్డ్‌లాగా తయారు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే అప్పటికే కార్డ్ కోసం డబ్బు చెల్లించిన వారి పరిస్థితిపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా కార్డు తీసుకునేలా రూ.225 చెల్లించాల్సిన విధంగా యాప్‌లో మార్పులు చేశారు. ఆ సమయంలో వాహనాలు కొన్నవారంతా చెల్లించారు. కానీ వారికీ కార్డులు లేవు. ఇటీవల మళ్లీ దానిలోనూ మార్పులు చేసి, కార్డు కావాలా, వద్దా అనే ఆప్షన్‌ను ఆన్‌లైన్‌లో ఇచ్చారు. కావాలనుకునేవారు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. లేనివారు పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని దానినే ఆర్‌సీ కింద చూపించవచ్చు. అయితే కార్డు కావాలని మళ్లీ డబ్బు చెల్లించినవారికీ కష్టాలు యథావిధిగానే కొనసాగుతున్నాయి. కార్డులు రాకపోగా ఆ వాహనాన్ని అమ్మాలంటే కొర్రీలు పెడుతున్న పరిస్థితి. కార్డు రానివారు వాహనం అమ్మబోతే, యాజమాన్య బదిలీకి కుదరదు. మీ కార్డు ప్రింట్ కాలేదు కనుక ముందు కార్డ్ ప్రింటింగ్ అయ్యేలా చూసుకోవాలంటూ ఎర్రర్ చూపిస్తుండటంతో వాహనదారులు రెండు రకాలుగా అవస్థలు పడుతున్నారు. అసలు ఆ కార్డులు ఎక్కడ ముద్రితమవుతాయో! ఎక్కడి నుంచి వస్తాయో కూడా అంతుబట్టని విషయం. వీటికోసం కార్యాలయాల్లో అడిగితే మాకూ ఏ సమాచారం లేదనే సమాధానం మినహా దానికి పరిష్కారం మార్గం చూపినవారేలేరు. దీంతో వాహనాల అమ్మకాలూ పెండింగ్ పడిపోతున్నాయి. వాహనాలు కొనాలన్నా, అమ్మాలన్నా రెండో వాహనం ఉండటం వల్ల ఎక్కువ పన్నులు చెల్లించాల్సిరావటంతో ఆ నష్టాన్నీ వాహనదారులు భరించాల్సిన పరిస్థితి. ఈ-వాహన్ యాప్ వచ్చి చాలా కాలం అయినా, దీనిలో బాలారిష్టాలు అధిగమించినా అధికారుల అలసత్వం, మామూళ్ల మత్తు లక్ష్యాన్ని నీరుగార్చుతోంది. దీనిపై ఉన్నతాధికారుల పూర్తిస్థాయి అజమాయిషీ ఉంటేనే ఆన్‌లైన్ సేవలు సక్రమంగా వాహనదారులకు అందే అవకాశం ఉంది. ప్రభుత్వ పెద్దలు దీనిపై దృష్టిపెడితేనే కొత్త, పాత వాహనాలు ఏ అడ్డంకులూ లేకుండా రోడ్డెక్కే అవకాశం ఉంది.

వైభవంగా ఉరుసు మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా 133వ ఉరుసు మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బాబా వారి సమాధిని దర్శించుకుని వారి, వారి ముడుపులను చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా బాబా వారికి సమర్పించిన శేష వస్త్రాలను నిర్వాహకులు భక్తులకు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బాబా వారు ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచుతామని, దీంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని దర్గా ధర్మకర్త రావి రామ్మోహన రావు తెలిపారు.


మస్తాన్ బాబా సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం డిగ్రీ కోర్సుల ఫలితాలు విడుదల


పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇతర అధికారులు

పెదకాకాని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ గతేడాది అక్టోబర్, నవంబరు నెలల్లో నిర్వహించిన పలు డిగ్రీ కోర్సుల ఫలితాలను విడుదల చేసినట్లు దూరవిద్య పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైన్ లాబ్దిన్ తెలిపారు. ఫలితాలను సోమవారం వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఏ నాలుగు, ఐదో సెమిస్టర్, బీకాం (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), 4, 5 సెమిస్టర్లు, బీబీఏ కోర్సుల 4, 5 సెమిస్టర్ల రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు వెల్లడించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఫిబ్రవరి 3వ తేదీలోగా ఒక్కొక్క పేపర్‌కు రూ. 770 చెల్లించి, దరఖాస్తులను దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. దూరవిద్య ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏఎన్‌యుసిడిఈ.ఐఎన్‌ఎఫ్‌ఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, సీటీఏలు డాక్టర్ లావణ్య, డాక్టర్ కృష్ణ సత్య, ఏసీటీఏ డాక్టర్ శివప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, రెడ్డి ప్రకాష్‌రావు, భాస్కర్, వలి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఉదయ్ కుమార్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల నూతన వైస్ ప్రిన్సిపాల్ గా ఆచార్య ఎల్. ఉదయ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు ఉదయ కుమార్ కు నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఆయన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆచార్య ఉదయ్ కుమార్ బుద్ధిజం విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్‌గా, పీజీ పరీక్షల కోఆర్డినేటర్‌గా, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్‌గా పలు పదవులను ఉదయ కుమార్ నిర్వహించారు.

ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా లబ్ధిదారులను గుర్తించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు


సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ 2.0 ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులను గుర్తించేందుకు అవాస్ ప్లస్ యాప్ ద్వారా నిర్దేశిత మా ర్గదర్శకాల ప్రకారం సచివాలయ, హౌసింగ్ అధికారులు సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. రూఫ్ లెవల్ పూర్తయిన ఇళ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సం ఘాల ద్వారా బ్యాంక్ లింకేజ్ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మా ణాలకు ప్రతివారం నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

గోకులాలు మంజూరు అయిన వాటిలో 50 శాతం కూడా పూర్తి కాలేదని, ఈ వారంలో పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే నవంబరులో ప్రారంభమైందని, ఇంతవరకు పూర్తి కాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఆర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 4 నుంచి 12 వరకు క్యాంప్‌లు నిర్వహిస్తుందని, పీడబ్ల్యూడీలు, సీనియర్ సిటీ జన్లకు చేతి కర్రలు, కృత్రిమ అవయవ పరికరాలు తయారు చేసి అందించడం జరుగు తుందని కలెక్టర్ తెలిపారు. పరికరాల కోసం వచ్చే దివ్యాంగులు వారి సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. మరింత సమాచారం కోసం 9389537925ను సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాదు, సిపిఓ శేషశ్రీ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మీ, డ్వామా పీడీ శంకర్, భూగర్భ జలనవరుల శాఖ డీడీ వందనం, డీపీవో సాయికుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మోహన్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, దివ్యాంగులు, సీనియర్ సిటి జన్ సంక్షేమ శాఖ ఏడీ సువార్త, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఆర్టీసీకి పండగే..

● సంక్రాంతికి రాకపోకలతో రూ.కోటి వరకు ఆదాయం
● తిరుగు ప్రయాణీకులతో ఎన్టీఆర్ బస్టాండ్‌లో రద్దీ

గుంటూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మూడురోజుల ముచ్చటైన సంక్రాంతి పండుగ ఆర్టీసీకి అదిరిపోయే ఆదాయాన్ని సమకూర్చింది. పండుగకు ప్రయాణీకుల రాకపోకలతో గుంటూరు జిల్లాలో ఆర్టీసీకి రూ.కోటి వరకు టిక్కెట్ ఛార్జీల రూపంలో ఆదాయం సమకూరినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం రవికాంత్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేశారు. విభజిత గుంటూరు జిల్లాలోని గుంటూరు-1, 2 డిపోలతో పాటు పొన్నూరు, తెనాలి, మంగళగిరి డిపోల నుంచి సాధారణ షెడ్యూల్ బస్సులతో పాటు అదనపు సర్వీసులను ఏర్పాటుచేశారు. పండుగకు ముందుగానే గుంటూరుకు వచ్చే ప్రయాణీకుల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వైజాగ్ ప్రాంతాల నుంచి 171 బస్సులను ఏర్పాటుచేశారు. కాగా పండుగ ముగిసిన తరువాత కనుమ రోజు పెద్దగా ప్రయాణీకుల రద్దీ ఉండదని అధికారులు భావించినా అందుకు భిన్నంగా కనిపించింది. కనుమ తరువాత రోజు కూడా ప్రయాణీకుల రద్దీ ఉండటంతో అదనంగా మరో 75 బస్సులు ఏర్పాటుచేశారు. ఇక విద్యార్థులకు సెలవులు ఆదివారంతో ముగియటంతో శని, ఆదివారాలు రాత్రి ప్రయాణీకుల రద్దీ పెరిగింది. దాంతో ఈ రెండు రోజుల్లో 70 సర్వీసులు అదనంగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సోమవారం రాత్రి కూడా మరో 10 బస్సులు అందుబాటులో ఉంచారు. గుంటూరు నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వైజాగ్ వంటి దూర ప్రాంతాలకు రద్దీ కనిపించింది. మొత్తానికి సంక్రాంతి పండుగకు జిల్లాలో ఐదు డిపోల నుంచి టిక్కెట్ ఛార్జీల రూపంలో సుమారు రూ.కోటి వరకు ఆదాయం సమకూరింది.


ఎన్టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

విశాఖపట్నం, చిత్తూరు జట్ల గెలుపు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ (నవులూరు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీల్లో భాగంగా 9వ రోజు విశాఖపట్నం, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. ప్రకాశం జిల్లా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 17.4 ఓవర్లలో 121 పరుగులు చేసి ఆలౌటయింది. 2.4 ఓవర్లలో పది పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టిన ధీరజ్ లక్ష్మణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కడప జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 18.4 ఓవర్లలో 199 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌటయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 17.3 ఓవర్లలో 148 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. 43 బంతుల్లో 74 పరుగులు చేయడంతోపాటు 3.3 ఓవర్లలో 37 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టిన కె.దినేష్ వర్మ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నారు. తెలుగు యువత మంగళగిరి పట్టణ అధ్యక్షుడు బోగి వినోద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. ఈ పోటీలకు సేల్, సక్కు, ఉషోదయ, మర్కోరోస్ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంప్‌లు

దుగ్గిరాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులను ఈనెల 21 నుంచి 30వతేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు. 21వతేదీ మంగళవారం దుగ్గిరాల షాదీఖానా, ఈమని -1 అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆధార్ నమోదు చేయనున్నారు. 22న దుగ్గిరాల, ఈమని-4 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద, 23న కేఆర్ కొండూరు, చుక్కపల్లివారి పాలెం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద, 24న పెనుమూలి, మోరంపూడిలో, 27న చిలువూరు, మంచికలపూడి, 28న చిలువూరు, పేరుకలపూడి పంచాయతీ కార్యాలయం వద్ద, 29న తుమ్మపూడి, పేరుకలపూడి, 30న రేవేంద్రపాడు, గొడవర్రు అంగన్‌వాడీకేంద్రం వద్ద మొబైల్ ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చర్చి ప్రారంభం



పెదపరిమిలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని ప్రారంభిస్తున్న బిషప్ భాగయ్య

తుళ్లూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పెదపరిమిలో ఆర్‌సీఎం చర్చి(ఫాతిమా మాత ఆలయం)ని గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగయ్య సోమవారం ప్రారంభించారు. సెంటర్లో గతంలోనే ఉన్న చర్చి శిథిలావస్థకు చేరటంతో తొలగించి నూతనంగా నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యే క ప్రార్థనలు చేసి దివ్య బలిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘస్తులు, విశ్వాసకులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. పెదపరిమి ఫాదర్ జ్ఞాన ప్రకాశ్, నరసరావుపేట మేత్రాణులు మల్లవరపు సుందరబాబు, సంఘస్తులు జార్జి, అంతయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రత్నాలచెరువులో ఆక్రమణల తొలగింపు



సర్వే నెం.134లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

మంగళగిరి సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి రత్నాలచెరువు సర్వే నెం.134లో అనధికార నిర్మాణాలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. పలువురు ఆక్రమణదారులు చెరువు భూములను ఆక్రమించుకుని ప్రహరీలు నిర్మిస్తున్నట్టు గుర్తించి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా ఆదేశాలతో జేసీబీలను ఉపయోగించి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల దృష్టికి తీసుకురావాలని కమిషనర్ అలీం బాషా కోరారు. చెరువులు, నీటి కుంటలు, ప్రభుత్వ భూములను కాపాడుకోవాలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఎంటీఎంసీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

యువకుడి మృతదేహం లభ్యం

తాడేపల్లి టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉండవల్లి ఎత్తిపోతల పథకం కృష్ణానదిలో ఆదివారం సాయంత్రం ఈతకు వచ్చి గల్లంతైన యువకుడు చాట్ల బాలు (18) మృతదేహం సోమవారం మధ్యాహ్నం లభ్యమైందని సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ కొత్తపేటకు చెందిన బాలు స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం కృష్ణానదికి ఈతకు వచ్చాడని, నదిలోకి దిగి గల్లంతయ్యాడని స్నేహితులు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇచ్చారని తెలిపారు. సమాచారం అందిన వెంటనే సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారని, చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారన్నారు. సోమవారం ఉదయం మంగళగిరి 6వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మృతదేహం లభ్యమైందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి వైద్యశాలకు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కళ్యాణ్ రాజు సోమవారం తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

దుగ్గిరాల(చిలువూరు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): చిలువూరు సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. కేఆర్ కొండూరుకు వెళ్లే రోడ్డులో మద్యం దుకాణానికి దగ్గర్లో మృతదేహం పడి ఉంది. స్థానికులను ఆరా తీయగా తమ గ్రామస్థుడు కాదని చెప్పినట్లు తెలుస్తోంది. సుమారు 55 నుంచి 60ఏళ్ల మధ్య వయస్సు కలిగి కాషాయరంగు దుస్తులు ధరించి ఉన్నాడు. పోలీసులు తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

పంప్‌హౌస్‌లో కాపర్ వైర్లు చోరీ

పెదనందిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - పర్చూరు రహదారిలోని మల్లాయపాలెం మేజర్ కాలువపై ఉన్న పంప్‌హౌస్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, పోలీసుల వివరా ప్రకారం కాలువకట్టపై ఉన్న వరగాని, ఏబీపాలెం గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే షెడ్డుల తాళాలు పగులగొట్టి ప్యానల్ బోర్డులోని కాపర్‌వైర్లను గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనా స్థలానికి పంచాయతీ కార్యదర్శి నాగయ్య వెళ్లి పరిశీలించి దీనిపై పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎత్తిపోతల పథకాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగలు, గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే మోటార్లలోని కాపర్ వైర్లు తరచూ అపహరణకు గురవుతుండడంతో అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

● సంవత్సరాలు గడుస్తున్నా ఖాళీగా దర్శనమిస్తున్న కేంద్రం
● రోడ్డు వెంటే చెత్తను తగలబెడుతున్న తీరు
● పొగతో ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు



ముగురుమయంగా ఉన్న 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం'

ప్రత్తిపాడు (కోయవారిపాలెం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోయవారిపాలెంలో సంపద తయారీ కేంద్రం ఎన్నో సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో చెత్త సేకరణతో పాటు డంపింగ్ యార్డుల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేసింది. ఈ పరిస్థితుల్లో పంచాయతీలు సైతం డంపింగ్ యార్డుల గురించి పట్టించుకోకుండా వదిలేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రతి గ్రామంలో చెత్త సేకరణతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అయితే కోయవారిపాలెంలో ఆ దిశగా ఇంత వరకు అడుగులు పడిన దాఖలాలు లేవు. ఈ గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మించిన తరువాత ఇంత వరకు ఒక్క బండి చెత్త అయినా ఇక్కడికి తీసుకు వచ్చిన ఆనవాలు లేవు. షెడ్డు మొత్తం మురుగు మయంగా మారింది. లోపలకు అడుగు పెట్టడానికి కూడా వీల్లేకుండా ఉంది. లక్షల వ్యయంతో ఈ షెడ్డును ప్రభుత్వం ఎందుకు నిర్మించిందో కూడా తెలియని పరిస్థితుల్లో ఈ పంచాయతీ ఉంది. అంతే కాకుండా గ్రామంలో సేకరించిన చెత్తను మొత్తాన్ని గుంటూరు పర్చూరు ప్రధాన రహదాన రోడ్డుపై వేసి అక్కడే తగల బెట్టేస్తున్నారు. నిత్యం ప్రయాణించే అధికారులు చూస్తున్నా అదేమని ప్రశ్నించిన దాఖలాలు లేవు. పంచాయతీల పనితీరును పర్యవేక్షించే అధికారులు మౌనం వహిస్తున్నారు. ఫలితంగా రోడ్డు వెంట ప్రయాణం చేసే వారు పొగతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు ప్రభుత్వం తడి, పొడి చెత్తలను వేరు చేయడంతో పాటు వాటిని వేసేందుకు డబ్బాలను కూడా ప్రతి కుటుంబానికి అందజేసింది. అంతే గాకుండా దీనిపై ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు కూడా నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్డు వెంట చెత్తను తగల బెట్టడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



రహదారిలో చెత్తను తగల బెట్టడంతో రోడ్డుపైకి వస్తున్న పొగ

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సర్వీసు రూల్స్ అమలుచేయాలి

● ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు యూనియన్ నాయకుల వినతి



ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

మేడికొండూరు జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సర్వీసు రూల్స్ అమలు చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ యూనియన్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజక వర్గంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కలసి వారు గుంటూరులోని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తాము ఉద్యోగంలో చేరి ఐదు సంవత్సరాలు దాటినా ఇప్పటికీ సరైన సర్వీసు రూల్స్ అమలు చేయలేదని, ఫలితంగా ఉద్యోగ పదోన్నతులకు అవకాశం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ స్పందిస్తూ సచివాలయ వ్యవస్థలో ఉన్న లోటు పాట్లను ప్రభుత్వం క్షుణ్ణంగా అధ్యయనం చేస్తుం దని, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సర్వీసు నిబంధనలు అమలు చేయడంతో పాటు వారికి పదోన్నతులు కల్పించే విషయమై కూటమి ప్రభుత్వం కల్పి స్తుందని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగులపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిందని, ఇందుకు ఈ అంశమే ఒక ఉదాహరణ అని చెప్పారు, గ్రామస్థాయిలో అభివృద్ధి పనుల్లో ఎంతో కీలకమైన ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలియ జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ యూనియన్ డైరీని, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ జె.నాగరాజు, జిల్లా అధ్యక్షుడు టి. శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ షేక్ గస్ సైదా, జనరల్ సెక్రెటరీ బి.జాన్ వెస్లీ, టెక్నికల్ సెక్రటరీ ప్రణీత్ బాబు తదితరులతో పాటు నియోజకవర్గ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

● వెటర్నరీ ఏడీ రాయప్పరెడ్డి

తాడికొండ(లాం), జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాడి రైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని వెటర్నరీ ఏడీ రాయప్పరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాడికొండ మండలం లాం పంచాయతీలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన పణిదరం, నిడుముక్కల, 22వ తేదీన లాం, 23వ తేదీన గరికపాడు, లచ్చన్నగుడిపూడి, 24న పొన్నెకల్లు, ముక్కామల, 25వ తేదీన దామరపల్లి, పాములపాడు, 27వ తేదీన బేజాత్‌పురం, 28న తాటిరెడ్డిపాలెం, రావెల, 29వ తేదీన బండారుపల్లి, మోతడక 30వ తేదీన కంతేరు, 31న తాడికొండ గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

● **పెదనందిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని 17 గ్రామాల్లో బుధవారం నుంచి ఈనెల 31వరకు నిర్వహించనున్న పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగించుకోవాలని ఏడీఏ నాయుడు శైలజ తెలిపారు. ప్రతిగ్రామంలో పశువులకు వైద్య పరీక్షలతో పాటు తేలికపాటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని, పాలదూడలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు, వ్యాధినిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

ఆలయాల సొసైటీ అధ్యక్షురాలిగా ముద్దన

పెదనందిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఆలయాల సొసైటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ముద్దన నగరాజకుమారి, కార్యదర్శిగా తడవర్తి సురేష్, కోశాధికారిగా డీఎల్ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కూనిశెట్టి శ్రీనివాసరావు, వెలినేని రాంబాబు, కొల్లా సాంబశివరావు, సంయుక్త కార్యదర్శులుగా సకలా వీరేంద్రగుప్తా, శ్రీరాం నాగేశ్వరరావులు మరో 10 మంది సలహాదారులుగా, 14 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను నిర్వాహక సభ్యులు దాసరి శేషగిరిరావు, నర్రా బాలకృష్ణ, పొన్నూరు బాలకుటుంబరావు, దాసరి సత్యనారాయణ, ముద్దన రాఘవయ్యలు నిర్వహించారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు

తాడేపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో ఇళ్లువేసుకుని జీవించే పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. సోమవారం పట్టణంలోని సుందరయ్యనగర్ మహానాడు, పుష్కరకాలనీ ప్రాంతాల్లో స్థానిక సీపీఎం నేతలతో కలిసి పర్యటించి ఇళ్ల పట్టాల కోసం పేదలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు మంత్రి లోకేశ్, పాదయాత్ర సమయంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కాగా రూ.294 కోట్లతో సుందరయ్యనగర్, మహానాడు ప్రాంతాల్లో కృష్ణానదికి రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు నిధులు కేటాయించామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమన్నారు.

సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుమందు తాగిన వ్యక్తి

ప్రత్తిపాడు(కొండేపాడు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోలీసులు చిత్ర హింసలు పెడతారేమో అనే అనుమానంతో కొండేపాడు గ్రామానికి చెందిన కళ్యాణ్ అనే వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుమందు తాగిన సంఘటన కొండేపాడు గ్రామంలో సోమవారం జరిగింది. కొండేపాడు కు చెందిన చల్లా శరత్ కుమార్ కొంత తన సొంత స్థలంతో పాటు మరి కొంత చర్చి స్థలాన్ని ఆక్రమించుకుని గోకుల్ షెడ్డు నిర్మిస్తున్నాడని, ఈ చర్చి నిర్మాణానికి సంబంధించి కొంత స్థలం తన తాత దానంగా ఇచ్చాడని, ఈ విషయంలో అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించు కోలేదంటూ కళ్యాణ్ తెలిపారు. ఈ క్రమంలోనే తమపై అక్రమ కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ పిలుస్తున్నారని చేయని నేరానికి తనను పోలీసులు చిత్రహింసలు పెడతారేమో అనే అనుమానంతో పురుగు మందు తాగాడు. ప్రస్తుతం కళ్యాణ్ గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

ద్విచక్ర వాహనం చోరీ

తాడికొండ(పొన్నెకల్లు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం ఆదివారం రాత్రి చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొన్నెకల్లు గ్రామానికి చెందిన నెల్లూరి రాంబాబుకు చెందిన ద్విచక్ర వాహనం రోజు మాదిరే తన ఇంటి ముందు పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం ఇంటి బయట బైక్ కనపించలేదు. దీంతో ఇంటి పక్కనే ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా బైక్‌ను దొంగిలించిన వ్యక్తి దామరపల్లి వైపు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ భూమిని ఆక్రమించుకున్నారు

గుంటూరు(తూర్పు), జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూమిని ఆక్రమించుకుని, దాని చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారని ప్రత్తిపాడు మండలం, నడింపాలెం గ్రామానికి చెందిన ఆలేటి ప్రభావతి సోమవారం కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. దాదాపు 25ఏళ్ల క్రితం 305/1సీ2 పేరుతో 3.80 ఎకరాల పట్టాను ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. దీనిని సాగు చేసుకుని ఉపాధి పొందుతున్నామని, కానీ ఈ మధ్యనే గుంటూరుకు చెందిన బంగారు వ్యాపారీ వినయ్ కుమార్ అనే వ్యక్తి ఈ భూమిని ఆక్రమించుకుని, ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడని అడిగితే దాడి చేస్తున్నాడని అన్నారు.

మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

మంగళగిరి సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23వ తేదీన మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని మండలాల్లో మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నా రు. సేకరించిన అన్ని బ్లడ్ యూనిట్లను ఎన్టీఆర్ ట్రస్టుకు అందజేయనున్నారు. అదే రోజు సాయంత్రం మయూరి టెక్ పార్కు ఎదురుగా ఉన్న మైదానంలో పెద్ద ఎత్తున లైవ్ మ్యూజిక్ షోకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి నవులూరు అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ సీజన్-3 పోటీలకు సంబంధించి 23న ఉదయం 9గంటలకు తృతీయ స్థానానికి పోటీ జరుగుతుంది. మధ్యాహ్నం 12:30 గంటలకు ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించి నీరందించాలి

● డీసీ అధ్యక్షుడు ఉప్పుటూరి తిరుపతిరావు, టీడీపీ అధ్యక్షుడు మన్నవ



గుంటూరు ఛానల్‌లో గుర్రపు డెక్కా, నాచు తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఉప్పుటూరి, మన్నవ తదితరులు

వట్టిచెరుకూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఛానల్ ప్రధాన కాలువలో నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న గుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపు పనులు రెండు రోజులుగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గుంటూరు ఛానల్ ప్రధాన కాలువలో గుర్రపుడెక్క, తూటుకాడ పెనవేసుకొని పోయి అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కాలువ మరమ్మతులపై దృష్టి సారించి టెండర్లు పిలిచి పనులు అప్పగించినా సదరు కాంట్రాక్టర్ జాప్యం చేశాడు. దీనితో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి డాక్టర్ మాకి నేని పెదరత్తయ్యలకు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సదరు కాంట్రాక్టర్‌పై, సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేసిన నేపథ్యంలో రెండు రోజులుగా మండలంలోని వింజనంపాడు ఆర్అండ్‌బీ వంతెన నుంచి పొక్లెనయిర్ ద్వారా గారపాడు వైపు గుర్రపుడెక్క, తూటుకాడ తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి సూచనలతో సోమవారం నూతనంగా ఎన్నికైన డీసీ చైర్మన్ ఉప్పుటూరి తిరుపతిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, జే రంగారావు, కాట్రపాడు, యామర్రు, గారపాడు గ్రామ అధ్యక్షుడు మర్రి సాంబశివరావు, చిన్నం సుబ్బారావు, ఉప్పుటూరి సాంబశివరావు, నల్లూరి సుబ్బారావు, రామచేంద్ర, లక్ష్మణ్, పవన్‌కుమార్‌లు వింజనంపాడు వంతెన నుంచి క్షేత్ర స్థాయిలో తొలగింపు పనులను పరిశీలించారు. సత్వరమే తొలగింపు పనులను పూర్తి చేసి నీరందించేలా చూడాలని గుంటూరు చానల్ ఏఈ జాన్‌బాబుకు నాయకులు సూచించారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన



వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించిన బాలల హక్కుల కమిషన్ ప్రతినిధులు

మంగళగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ బాలల హక్కుల కమిషన్ ప్రతినిధులు రాజేంద్రనాథ్, పద్మావతి బృందం సోమవారం మంగళగిరి పట్టణంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించింది. బాలల హక్కులు, చట్టాలను వివరించి, వాటి పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని, సామాజిక మాధ్యమాలను పరిమితంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మంగళగిరి మండల విద్యాశాఖ అధికారి ఎస్ బాబు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ శ్రీనివాసరావు, సచివాలయ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

ఏఎన్‌యూ రిజిస్ట్రార్ సింహాచలం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఏఎన్‌యూ రిజిస్ట్రార్ సింహాచలం

మంగళగిరి సిటీ (ఎర్రబాలెం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ.సింహాచలం అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని ఎర్రబాలెం డాన్‌బోస్కో ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో సోమవారం విద్యార్థులతో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన చైనీస్ పజిల్, హైడ్రోజన్ ట్రైన్, మెట్రో ట్రైన్, రాత్రి పగలు ఏవిధంగా జరుగుతాయో తెలియజేసే పరికరం వంటి ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆచార్య సింహాచలం మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక సృజనాత్మకత దాగివుంటుందని, దానికి ఉపాధ్యాయులు గుర్తించి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. మాతృభాష ప్రాముఖ్యతను గుర్తించి విద్యార్థులు మాతృభాషపై పట్టుసాధించేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డాన్‌బోస్కో ప్రిన్సిపాల్ చినబాబు, జోస్, మర్రెడ్డి, జోసెఫ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

48వ రోజుకు చేరుకున్న ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు సోమవారంతో 48వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే దీక్షలను యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ ప్రారంభించి మాట్లాడుతూ కార్మి కులు న్యాయబద్ధంగా తమకు రావలసిన నష్టపరిహారం కోసం పోరాటం చేస్తున్నారని, పాలకులు మాత్రం సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోర్టు తీర్పు ఇచ్చినా కూడా పరిష్కారం కాలేదన్నారు. పాలకులు నిర్లక్ష్య వైఖరిని విడనాడి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో ఇమాంబి, లక్ష్మి, బుజ్జి, రమణ తదితరులు కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా వేముల దుర్గారావు, ఆశీర్వాదం, బాష, నవనీతం, శాస్త్రి, శౌరి తదితరులు పాల్గొన్నారు.

బోధనలో అధునాతన పద్ధతులను అనుసరించాలి

● ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ రవీంద్ర



బోధన పద్ధతుల గురించి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఆలపాటి రవీంద్ర

మేడికొండూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధనలో వస్తున్న అధునాతన పద్ధతులను అనుసరించాలని ప్రవాస భారతీయులు, ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఆలపాటి రవీంద్ర చెప్పారు. గుండ్లపాలెంలోని ఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ కళాశాలల బోధన సిబ్బందికి టీచింగ్ అండ్ లెర్నింగ్‌పై సోమవారం జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆలపాటి రాజా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆలపాటి రవీంద్ర తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ నూతన అధునాతన పద్ధతులు ఉపయోగించి విద్యను బోధించడం ద్వారా విద్యార్థుల్లో సబ్జెక్టులపై అవగాహన త్వరగా కల్పించడమే కాకుండా వారిలో జ్ఞాపకశక్తిని పెంచవచ్చునని చెప్పారు. దీనివల్ల పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచవచ్చని చెప్పారు. మూల్యాంకనం, నమోదు, విజువలైజేషన్ ద్వారా విద్యార్థుల్లో ఎక్కువ కాలం జ్ఞాపకం ఉంచుకొనేందుకు తోడ్పడుతుందని, తద్వారా పరీక్షల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఐటీ కంపెనీల అధినేత శరత్ మాట్లాడుతూ అధ్యాపకులు బోధనా పద్ధతులపై సరైన అవగాహన కలిగి ఉన్నట్లయితే విద్యార్థులకు అనేక రకాలుగా మేలు జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఈడీ తిలక్‌బాబు, ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, వివిధ కళాశాలల బోధన సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొన్న అలపాటి రవీంద్రను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆలపాటి రాజా అభినందనలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.9.24 లక్షల మంజూరు



గౌస్ బాషాకు చెక్కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి (పెదవడ్లపూడి), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలోని ప్రజలు కష్టకాలంలో ఉంటే మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించి అండగా నిలుస్తున్నారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ గౌస్ బాషా కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. గౌస్ బాషా ఆర్థిక ఇబ్బందులను గ్రామ టీడీపీ నాయకులు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన లోకేశ్ సీఎం చంద్రబాబుతో మాట్లాడి గౌస్ బాషా పరిస్థితిని వివరించారు. సీఎం చంద్రబాబు రూ.9 లక్షల 24 వేల 724లను సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయించారు. మంత్రి లోకేశ్ ఆదేశాలతో స్థానిక టీడీపీ నాయకులు సోమవారం లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి మంజూరు పత్రాలను అందజేశారు. రూ. లక్షల విలువైన చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు గౌస్ బాషా కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, తెలుగుయువత రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, నేతలు మాదల రమేష్‌బాబు, అన్నే చంద్రశేఖర్, నడపన దుర్గారావు, షేక్ సర్వర్, మొద్దుకూరి రమేష్, షేక్ బాజీ షాహిద్, కొడవలి ఆనంద్, లాల్ బేగ్, జవ్వాది ఆంజనేయులు, కఠారి సాంబయ్య, మస్తాన్‌వలి, అహ్మద్, బాజీవలి, షేక్ నేపాల్, అమీర్ బేగ్, శరణు విష్ణు, శోభన్‌బాబు, బొర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మంత్రి లోకేశ్ హామీతో పసుపు రైతుల ధర్నా విరమణ

తెనాలి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ హామీతో సోమవారం పసుపు రైతులు తలపెట్టిన ధర్నా విరమించారు. దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదం కారణంగా ఏడాది క్రితం పసుపు రైతులు తాము నిల్వచేసిన పసుపును నష్టపోయారు. పరిహారం న్యూ ఇండియా ఇన్సూరెన్స్ అందించకపోవడంతో సోమవారం తెనాలిలోని కార్యాలయం ఎదుట ధర్నా తలపెట్టారు. మంత్రి కార్యాలయం నుంచి రైతుల సమస్య పరిష్కరించేందుకు సమాచారం అందడంతో ధర్నా నిలిపివేశామని సంఘ నాయకులు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. పసుపు సంఘం కన్వీనర్ జొన్న శివశంకరరావు, వెంకట్రామయ్య, సాంబశివరావు, శివశంకరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో కోతుల బెడద

● వానరాల గుంపులతో ఇక్కట్లు
● వృద్ధులు, మహిళలపై దాడులు
● పంటలు నష్టపరుస్తుండటంపై ఆందోళన
● అధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల వినతి

కొల్లిపర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంక గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న కోతులతో రైతులు, లంక గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులపై దాడులు చేస్తుండటంతో వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. మున్నంగి, వల్లభాపురం, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొమ్మువానిపాలెం, అన్నవరం, అన్నవరంగౌడపాలెం గ్రామాల్లో కోతులు ఎక్కువగా సంచరించటంతో రైతులు ఏమిచేయాలో అర్థం కాక ఒకింత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లోని కూరగాయలను, అరటి తోటల్లోని గెలలను, బొప్పాయి తోటల్లో పిందెలను కోతులు కోసివేసి నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు నష్టపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల్లో కాపలా ఉన్నప్పటికి ఉపయోగం లేకుండా ఉంటోందని రైతులు వాపోతున్నారు. మహిళలు పొలాలకు ఒంటరిగా వెళ్లాలంటేనే కోతుల గుంపులతో భయపడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. పగలు పంట పొలాల్లో సాయంత్రానికి గ్రామాల్లోకి చేరి గృహాల్లో ఉన్న వస్తువులను పాడుచేస్తున్నట్లు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోతులను పట్టించి పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొల్లిపర సమీపంలో రోడ్డుపై గుంపులుగా ఉన్న కోతులు

జాతీయ వర్క్ షాప్ బ్రోచర్ ఆవిష్కరణ

పెదకాకాని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్య కళాశాలలో ఈ నెల 22, 23 తేదీలలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వర్క్ షాపు బ్రోచర్‌ను సోమవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. అథ్లెటిక్స్ పోటీల నిర్వహణలో ఆధునిక పోకడలు అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు వర్క్ షాప్ డైరెక్టర్, వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.జాన్సన్ తెలిపారు. ఈ సందర్భంలో వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య వీపీఎస్ పాల్‌కుమార్, యోగా కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ డి. సూర్యనారాయణ, విభాగం అధ్యాపకులు జె. రామ్మోహనరావు, ఏ.రాధిక, జె.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో నెహ్రూ నితన్ విద్యార్థి ప్రతిభ

తెనాలి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నెహ్రూ నితన్ స్కూల్ విద్యార్థిని షేక్ సనా ఫాతిమా పతకం సాధించింది. 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని రేపల్లెలో ఇటీవల జరిగిన కిడ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం పొందింది. విద్యార్థినిని సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎండీ మురళీకాంత్ అభినందించారు.

కార్యకర్త మృతికి టీడీపీ నేతల నివాళి

పొన్నూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామ నివాసి తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త గ్రామ మాజీ సర్పంచ్ తలకొండపాటి చిన్నసుబ్బారావు సోమవారం మృతి చెందారు. చిన్న సుబ్బారావు మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఫోన్లో సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు బండ్లమూడి బాబురావు, ఆరెమండ విజయ్ కుమార్ తోట రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి: ఎంవీఐ

పొన్నూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెనాలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టీ రాఘవరావు అన్నారు. సోమవారం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీఐ రాఘవరావు మాట్లాడుతూ డ్రైవర్లు డ్యూటీ సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాద రహితంగా డ్రైవింగ్ చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేస్తే సురక్షిత ప్రయాణం సాధ్యమన్నారు. ప్రయాణికుల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సదస్సులో డీఎం టి.అజిత కుమారి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు పొన్నూరు విద్యార్థి ఎంపిక



అభయ్ సింగ్

పొన్నూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ పొన్నూరు పట్టణానికి చెందిన సెయింట్ థామస్ కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి అభయ్ సింగ్ ఎంపికైనట్లు సోమవారం పాఠశాల నిర్వాహకులు తెలిపారు. జనవరి 26వ తేదీన విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. అభయ్‌సింగ్ ఎంపిక కావడంపై పాఠశాల డైరెక్టర్ వీడీ థామస్ ప్రిన్సిపాల్ రేజ్ థామస్, కో ఆర్డినేటర్ జోసెఫ్, స్కౌట్ మాస్టర్ అర్జున్‌రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వాసవి క్లబ్ అధ్యక్షుడిగా వంశీకృష్ణ

పొన్నూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ అధ్యక్షుడిగా కొత్తూరి వంశీకృష్ణ ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోని తాటికొండ రామకృష్ణ నివాసం వద్ద వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి బాపనపల్లి ప్రభాకర లక్ష్మీ ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగింది. పొన్నూరు నూతన కార్యవర్గ సభ్యులుగా పల్లపోతు గణేష్ పోలిశెట్టి విజయ్ కుమార్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు స్మారక స్మృతి కమిటీ జిల్లా అధ్యక్షుడు టి.శివరామకృష్ణ కె. బ్రహ్మేశ్వరరావు, సి.షణ్ముఖం, ఎం.నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు ఆర్.మోహన్, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

తెనాలి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, యువగళం పాదయాత్రలో తన సత్తా సాటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆయన దోహదపడ్డారని చెప్పారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఈ అంశంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. సోమవారం పెదకాకాని మండల పరిధిలోని అనుమర్లపూడిలో పొలాల రీ సర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నరేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మహా కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మంగా గట్టి చర్యలతో చేపడుతున్న గ్రామాలలో పొలాలు రీ సర్వే కార్యక్రమంలో రైతుల సంక్షేమ కోసమే అన్నారు. ప్రతి ఒక్కరికి సంబంధించిన భూములను సర్వే జరిపించి, వారికి హద్దురాళ్లను వేయించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిచేసి, రైతులకు మేలు చేసేందుకే పొలాల రీ సర్వేని చేపట్టిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా రైతులు, పేద ప్రజానీకం ఇబ్బందులు పడకూడదని, వారి ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. అందుకోసమే ఈ చర్యలు చేపట్టడం జరిగిందని నరేంద్ర పేర్కొన్నారు. అనంతరం సంపూర్ణ పారిశుధ్యత (ప్రతి ఇంటికి మరుగుదొడ్డి) కార్యక్రమంలో భాగంగా గుంటూరు డయాసిస్ సోషల్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో అనుమర్లపూడి గ్రామ ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన 50 ఫ్యామిలీ టాయిలెట్లను ఎమ్మెల్యే నరేంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో ఫాదర్ ఉన్నం కిరణ్, ఫాదర్ జ్యోతిరాజు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం నాయకులు, వార్డు నెంబర్లు, బూత్ కన్వీనర్లు, పార్టీ అనుబంధ కమిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.



అనుమర్లపూడిలో భూమి రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

బ్యాంకు రుణాలను సక్రమంగా చెల్లించాలి

● డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

కొల్లిపర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో యానిమేటర్లకు, పొదుపు సంఘాల సభ్యులకు ఆమె సమావేశాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువ చేసుకుంటే ఎక్కువ రుణాలు పొందటానికి వీలుకలుగుతుందన్నారు. మండలంలో డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఇప్పటివరకు 20కోట్ల 64లక్షల రూపాయల రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు స్త్రీనిధిలో కూడా పొదుపు చేసుకోవాలన్నారు. పొదుపు సంఘాల సభ్యులు ప్రతి నెల సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, ఎమ్ఎస్‌ఏ సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్

పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు

పొన్నూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. సర్వే కోసం మూడు ఫిర్యాదులు, విద్యుత్ సమస్యలపై ఒకటి, పశు వైద్యంపై ఒకటి, రోడ్లు భవనాల శాఖకు సంబంధించి సమస్యలపై ఒకటి సివిల్ సప్లై సమస్య ఒకటి ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై పోలీసు దాడులు అమానుషం

● బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్

తెనాలి క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై పోలీసులు దాడులు నిర్వహించడం అమానుషమని తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన్ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద పోలీసుల దాడులపై నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, గత నెల 26వ తేదీన పొన్నూరు పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రాజకుమార్ సీనియర్ న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై దాడిచేసి, అతనిపై తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరిశంకర్ మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును దేశవ్యాప్తంగా అమలులోకి తీసుకు రావాలన్నారు. గాయపడిన ప్రకాశరావుకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ నిరసనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అప్పల కిషోర్, గుమ్మడి రవి రాజ్, అబ్దుల్ ఆరీఫ్, కంచర్ల కోటేశ్వరరావు, రెడ్డి వెంకటేశ్వరరావు, నాగళ్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

● మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలి, మారీసుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పురపాలక సంఘం పరిధిలోని 40 వార్డుల ప్రజలు చెల్లించినవలసిన ఇంటి, ఖాళీస్థలాలు, నీటి కుళాయిల పన్నులను నిర్ణీత సమయంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. పన్నులు చెల్లించేందుకు వచ్చేవారి కోసం వార్డు సచివాలయలు, పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటర్లలో పన్నులు చెల్లించి తగిన రసీదును పొందాలన్నారు. సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు కూడా వార్డుల్లో ప్రజలు చెల్లించవలసిన పన్నులకు నోటీసులు అందజేసి సకాలంలో పన్నులు చెల్లించేలా బాధ్యతో మెలగాలని ఒక కోరారు.



ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

తెనాలిలో ఆక్రమణల తొలగింపు

తెనాలి, మారీసుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చేపట్టారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు ఆధ్వర్యంలో డ్రెయిన్లపై అక్రమ కట్టడాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశాలతో పట్టణ అభివృద్ధి పనులలో భాగంగా డ్రెయిన్లపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ మున్సిపల్ నిబంధలను అనుసరించి నూతన భవనాలను నిర్మించుకోవాలన్నారు. అందుకు భిన్నంగా నిర్మించిన భవన నిర్మాణాలను తొలగించడం జరుగుతుందని తెలిపారు. పట్టణాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే పట్టణంలో పరిశుభ్రత సాధ్యమవుతుందని పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. సోమవారం పట్టణంలోని 21, 22వ వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంలో వార్డులలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం గమనించి అధికారుల తీరుపై మండిపడ్డారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టణాన్ని సుందరీకరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారన్నారు. ప్రస్తుతం పలు వార్డుల్లో డ్రెయిన్‌లు ఆక్రమణలకు గురికావడాన్ని గుర్తించామని వాటిని స్వచ్ఛందంగా తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహబూబ్ భాషా, మున్సిపల్ టీపీవో సాంబశివరావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామోత్సవంగా వస్తున్న స్వామివారు, భక్తులు

వైభవంగా సీతారామస్వామి గ్రామోత్సవం

తెనాలి రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సీతారామస్వామి వార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మండలంలోని అంగలకుదురులో ఆంధ్ర వాల్మీకి వాసుదాసస్వామి, దాసశేషస్వామి వార్ల గురు పరంపర పీఠం దాసకుదుటి ఆశ్రమం, హిందూ ఐక్య వేదికల ఆధ్వర్యంలో సోమవారం స్వామివార్ల ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. గ్రామంలోని మహిళలు స్వామివార్లకు పుష్పాలు, టెంకాయలు సమర్పించి నీరు వారపోసి గ్రామాన్ని సుభిక్షింగా ఉండేలా చల్లని చూపు చూడాలని ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ నెల 22న స్వామి వార్ల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరగనుందని నిర్వాహక సభ్యులు ఉలిచి సీతారామ శర్మ (పట్టాభి) తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు రూరల్ ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ చెప్పారు. మండలంలోని అంగలకుదురు శివారులో సోమవారం పేకాడుతున్నట్లు అందిన సమాచారంతో సిబ్బందితో దాడులు జరిపామన్నారు. దాడుల్లో 8మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1లక్ష 20వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్జీల సత్వర పరిష్కారానికి కృషిచేస్తా

● తహసీల్దార్ గోపాలకృష్ణ



బాధితుల నుంచి సమస్యను తెలుసుకుంటున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తన కార్యాలయానికి వచ్చిన అర్జీలను సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మండలంలోని పలు ప్రాంతాల నుంచి సమస్యలు పరిష్కరించాలని నాలుగు అర్జీలు అందాయి. వాటిల్లో పినపాడు పంచాయతీ పరిధికి సంబంధించి 1, పట్టాదారు పాసుపుస్తకం కోసం మరో 2, సర్వే కోసం ఒకటి అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పురపాలక సంఘానికి ఐదు అర్జీలు

తెనాలి, మారీసుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కి రెండు, ఆరోగ్య విభాగానికి ఒకటి, టౌన్ ప్లానింగ్ విభాగానికి రెండు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయానికి 14 దరఖాస్తులు

తెనాలి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ 4, పోలీసు 3, మున్సిపల్, సర్వే విభాగాలకు సంబంధించి రెండేసి, హౌసింగ్, మెడికల్, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.

కాటూరి శిల్పశాలలో రతన్‌టాటా విగ్రహాలు

తెనాలి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెనాలి కాటూరి శిల్పశాలలో దివంగత పారిశ్రామికవేత్త రతన్‌టాటా విగ్రహాలను తయారు చేసి ప్రదర్శించారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి సోమవారం శిల్పశాలను సందర్శించి విగ్రహాలను తిలకించారు. భారతదేశానికి రతన్‌టాటా చేసిన సేవలు ఎనలేనివని చెప్పారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీలో రూపొందించిన శిల్పాలను చూస్తే శిల్పి కాటూరి వెంకటేశ్వరరావుకి అవార్డు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన ప్రతిభ పాటవాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, తెనాలి శిల్పులు ఈ ప్రాంతానికి గర్వకారణమని చైనాలో భారీ విగ్రహాలు తయారు చేయడానికి అక్కడి ప్రభుత్వం శిల్పులకు తగిన ప్రాధాన్యం ఇస్తుందని, మన శిల్పులకు కూడా అవకాశం ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీహర్ష, రవిచంద్ర పాల్గొన్నారు.



రతన్‌టాటా విగ్రహాలను తిలకిస్తున్న రాజకుమారి, మురళి తదితరులు

రేపటి నుంచి తెనాలిలో పింఛనుదారులకు అర్హత పరీక్షలు

● దివ్యాంగుల కోటాలో 25,354 మందికి లబ్ధి ● వైసీపీ హయాంలో ఎక్కువమంది అనర్హులకు పింఛన్లు

గుంటూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వడ్డించేవాడు మనవాడైతే ఏ మూల కూర్చున్నా పర్వాలేదు అన్నట్లు గత ప్రభుత్వ పింఛన్ల పంపిణీ రుజువు చేసింది. నిజానికి కళ్ళు, కాళ్ళు, చేతులు, చెవులు బాగానే ఉన్నా పింఛన్ల కోసమని వాళ్ళందరినీ దివ్యాంగుల కోటాలో వైసీపీ ప్రభుత్వం పింఛన్లను అందజేసింది. వీటిపై రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నెల 22 నుంచి తెనాలి మునిసిపాలిటీ పరిధిలోని దివ్యాంగుల కోటా పెన్షన్లపై విచారణ జరగనుంది. ముందుగా మునిసిపాలిటీ పరిధిలో రూ.ఆరువేల పింఛను పొందుతున్న లబ్ధిదారులకు నోటీసులు అందజేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. రోజుకు 50మంది లబ్ధిదారులను వైద్యులు పరీక్షిస్తారు. వారు ఏ విభాగంలో పింఛను పొందుతున్నారో గుర్తించి, ఆ విభాగానికి చెందిన వైద్యుడితో పరీక్ష చేయిస్తారు. ఇదేవిధంగా జిల్లా లోని అన్ని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలలో విచారణ జరుగుతోంది. జిల్లాలో దివ్యాంగుల కోటాలో 25,354 మందికి లబ్ధి చేకూరుతుండగా అందరికీ మళ్ళీ పరీక్షలు నిర్వహించి నిజమైన అర్హులను గుర్తించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో చాలామంది అనర్హులు సచివాలయంలో రూ.10వేలు చెల్లిస్తే వైద్య పరీక్షలకు వెళ్లకుండానే అంగవైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్లు అందజేశారు. దీనివల్ల చాలామంది ఆరోగ్యవంతులు కూడా రూ.6వేలు పెన్షన్ తీసుకుంటున్నారు.

రూ.15 వేల పింఛన్లలో బోగస్‌లు

రూ.15 వేలు పింఛను పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, అధికారులు ఆశ్చర్యపోతున్నారు. కేవలం మంచానికి మాత్రమే పరిమితం అయిన వారుమాత్రమే రూ.15వేలు పెన్షన్ పొందేందుకు అర్హులు. అయితే పరీక్షలు నిర్వహించేందుకు వెళ్తున్న అధికారులు చాలామంది లబ్ధిదారులు చక్కగా రోడ్ల మీద తిరుగుతుండటం చూసి ఆశ్చర్యపోతున్నారు.

యాప్ పట్టేస్తుంది

రూ.15వేలు, రూ.6వేలు పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల్లో అనర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం కొత్త యాప్ ను అందుబాటులోకి తెచ్చింది. ఆ యాప్‌లో లబ్ధిదారుడు ఆరోగ్య వివరాలు నమోదుచేస్తే వారికి ఎంత శాతం అంగవైకల్యం ఉందో యాప్ నిర్ధారిస్తుంది. ఇప్పటివరకు జరిగిన రూ.15 వేల పెన్షన్లలో ఎక్కువమంది అనర్హులున్నట్లు గుర్తించారు.